Entered.

ఆదివారం
ప్రజాశక్తి
నవంబర్ 14, 2004









ప్రియమైన పిల్లల్లారా....

హ్యాపీ బర్త్‌డే

(14-11-2004 నుంచి 20-11-2004 వరకు)

కార్తీకి
10సం॥, 14.11.1994
సుబ్బలక్ష్మి-దొరయ్యనాయుడు
చల్లపల్లి-తూ॥గో॥

నాగవైష్ణవి
1సం॥, 16.11.2003
వరలక్ష్మి-నరసింగరావు
రాంబాగ్ -హైదరాబాద్

దినేష్‌చందన్
3సం॥, 16.11.2001
రేణుక-మధు
శ్రీశైలం-కర్నూలు

నాగలక్ష్మి
3సం॥, 16.11.2001
రమణమ్మ-నాగరాజు
పెద్దమానాపురం-విజయనగరం

ఎన్.నవీన్‌రాజు
10సం॥, 17.11.1994
రమణ-రాజు
తాడేపల్లిగూడెం

కె.వెంకీ
1సం॥, 17.11.2003
విజయలక్ష్మి-ఉపేందర్
వెంకటాపురం-ఖమ్మం

శ్రీఫణికైలాష్
5సం॥, 17.111999
రమాపద్మ-కమలాకర్
పెద్దాపురం-తూ॥గో॥

జి.సౌజన్య
4సం॥, 18.11.2000
లలిత-రాజీవ్‌ప్రభాకర్
బేతంచెర్ల-కర్నూలు

మద్దినేని మాన్విత
4సం॥, 19.11.2000
పల్లవి-నర్సింహారావు
జగ్గయ్యపేట-కృష్ణా

ఎ.సుజిత
4సం॥, 19-2000
మహాలక్ష్మి-సువర్ణరాజు
చీమకుర్తి-ప్రకాశం

సంజన్
1సం॥, 19.11.2003
సునీత-నాగభూషణ్
నల్లగొండ

ఆదర్శ వంశీ
నవంబర్-19
గంగాభవాని-మరియదాస్
మల్కాపురం-విశాఖ

వేంకటసుబ్బయ్యచౌదరి
3॥, 19.11.2001
అన్నపూర్ణ-శ్రీనివాసరావు
వేమవరం-ప్రకాశం

కీర్తిసృజన
1సం॥, 19.11.2003
మంజులాదేవి-రాంబాబు
చిలకలపూడి-మచిలీపట్నం

మణి వెంకట అనిల్
4సం॥, 19.11.2000
శ్రీలత-శ్రీనివాస్
విజయవాడ

లీలాశివదుర్గాప్రసాద్
2సం॥, 19.11.2002
రాజేశ్వరి-రాజయ్య
డోర్నకల్-వరంగల్

నాని
1సం॥, 19.11.2003
నీరజ-జితేందర్‌రావు
నల్లబెల్లి-వరంగల్

పి. పల్లవి
9సం॥, 20.11.1995
శ్రీవాణి-సురేందర్‌రావు
గడ్డంపల్లి-మ॥నగర్

తనూజ పెర్సిస్
4సం॥, 20.11.2000
లలిత-కిషోర్‌గాంధి
పెదపేట-ప॥గో॥

యుక్తాప్రియనీతి
6సం॥, 20.11.1998
శోభారాణి-పవన్‌కుమార్
ఒంగోలు-ప్రకాశం

నాగేందర్‌గౌడ్
రాజుగౌడ్
జియాగూడ-హైదరాబాద్

దీపిక
1సం॥, నవంబర్-2003
సునీత-కిషన్
జియాగూడ-హైదరాబాద్

నిహారిక
10సం॥, నవంబర్-1994
పుష్పలత-మోహన్
రాందేవ్‌గూడ-హైదరాబాద్

ఉదయ్
3సం॥, నవంబర్-2001
పద్మ-శ్రీనివాస్
రాజాం-శ్రీకాకుళం

రీడర్స్ మెయిల్

టు ది ఎడిటర్, ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

కవర్‌స్టోరీ హైలైట్

31వతేదీ కవర్‌స్టోరీ 'తెంగ్లీష్ తల్లికి మంగళహారతి' చదివిన తర్వాత మన తెలుగుభాషను ఏ విధంగా ఖూనీ చేస్తున్నామో తెలుస్తోంది. చేకూరి రామారావు, యాంకర్ సుమల ఇంటర్వ్యూల్లోని విషయాలు బాగున్నాయి. ఏదిఏమైనా తెలుగువారందరం తెలుగులో మాట్లాడి, తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. ఆరోగ్యం పేజీలో 'పురోగమనంలో చింతలూరు' ద్వారా అనేక విషయాలు తెలుసుకున్నాం. టూరిస్ట్‌గైడ్‌లోని మైసూరు బృందావనం విశేషాలు చదివాం. బాగున్నాయి. మా స్కూల్ పిల్లలకు చదివి విన్పించాం.

–కామిడి సతీష్‌రెడ్డి,
జడలపేట, వరంగల్‌జిల్లా

మంచి ప్రయోగం

తెంగ్లీష్‌గా నేటి యువతరం మాట్లాడే తీరు గురించి, తద్వారా భాషలో వస్తున్న మార్పుల గురించి రాసిన వ్యాసం బాగుంది. ఈ తరహాలో రాయడం ఒక మంచి ప్రయోగం. వేరే భాషకు చెందిన అమ్మాయి సుమ తెలుగు యాంకర్‌గా మంచి తెలుగు మాట్లాడటం, మన తెలుగు అమ్మాయిలు తెలుగుభాషను వేరే రకంగా మాట్లాడటం చూస్తుంటే విచిత్రమనిపిస్తుంది. సుమతో ఇంటర్వ్యూ బాగుంది.

–రామినేని సుబ్బారావు,
తిరువూరు, కృష్ణాజిల్లా.

సినీజానపదం కొసరాజు

కొసరాజు వర్ధంతి సందర్భంగా ఇచ్చిన వ్యాసం ఆద్యంతం చదివించింది. కొసరాజు ప్రతిభాపాటవాలు ఎలాంటివో తెలుసుకోవాలంటే ఆయన గీతాలు వినాలి. తెలుగు సినీ జగత్తును దాదాపు అరశతాబ్దం పాటు తిరుగులేని జానపద గీతాల పుట్టగా సంచలనం సృష్టించారు. ఆయన పాటల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. కాని నేటి పాటల రచయితలు కేవలం పదాలనేతగాళ్ళు మాత్రమే.

–ఎం డి ముస్తఖీమ్,
కొల్లాపూర్, మహబూబ్‌నగర్‌జిల్లా.

మకుటంలేని మా'రాజు'

సినీగీత రచయితగా కొసరాజు అచ్చమైన, స్వచ్ఛమైన తెలుగుపదాలు పరవళ్ళుతొక్కే విధంగా రాశారు. పండితులు, పామరులు ఆ పాటల మాధుర్యాన్ని చవిచూచి పరవశించేలా రాశారు.

–మేడూరి సత్యనారాయణ,
ఖైరతాబాదు, హైదరాబాదు.

సినీగీత మధురిమ

అలనాటి చిత్రసీమలో కవిరాజు ఈ కొసరాజు. ఆయన సినీ గీత సాహిత్యం గురించి, వారి సినిమాల అనుభవాల గురించిన జ్ఞాపకాలు మధురాతిమధురంగా ఉన్నాయి. ఆదివారం అనుబంధాల కవర్‌పేజీలు చాలా అందంగా ఉంటున్నాయి. సప్తవర్ణములతో ఆకర్షింపజేస్తున్నాయి.

–డా॥తడక్ గణేష్, భూదాన్‌పోచంపల్లి.

కథలు బాగున్నాయి

'శతృత్వాలు' కథ లో ప్రస్తుత మానవ జీవన సరళిలో పట్టిపీడిస్తున్న వ్యత్యాసం సమస్యను...ముష్టోడు, ముత్తేలబాబుల పాత్రల ద్వారా రచయత తెలియజేసిన తీరు బాగుంది. 'రామచిలుక నవ్వింది' బాలలకథలో తమ రాజ్యపరిధిలోని ప్రజలు ఎటువంటి బాధలు పడుతున్నారో చిలుక తెచ్చిన సందేశంతో రాజుకు తెలియజేసిన విధానం బాగుంది. కొసరాజుగారి గురించిన వ్యాసం మాకెంతో నచ్చింది.

–కొప్పుల కాశీ విశ్వేశ్వరరావు,
– వేదవేద్యసూర్యవంశీధర్,
మర్రిపాలెం, విశాఖ.

అనుబంధం బాగుంది

మాకిష్టమైన కథలు, శీర్షికలతో ప్రతీవారం అనుబంధం వెలువడటం మాకు చాలా ఆనందం కల్గిస్తోంది. దినదినాభివృద్ధితో ఇంకా ఎత్తుకు ఎదగాలని కోరుకుంటున్నాం.

–అన్నే వెంకట కృష్ణారావు,
గన్నవరం, కృష్ణాజిల్లా.

రుచిగా వంటలు

రుచి పేజీలో పిండివంటలు మంచివి ఇస్తున్నారు. రుచికి, ఆరోగ్యానికి, తక్కువ ఖరీదుతో తయారయ్యేవి ఇస్తున్నారు. ముఖ్యంగా ఆరోగ్యానికి అవసరమయ్యే, తక్కువ కొవ్వును ఇచ్చే రకాలు ఇస్తున్నారు. రాగిపిండితో తయారయ్యే పిండివంటలను గూర్చి గతంలో ఇచ్చారు. వివిధ రకాల పిండులతో కలిపి ఆహారం తీసుకోవడం మంచిదని న్యూట్రీషియన్లు చెబుతున్నారు. అలాంటి పిండివంటకాలు గురించి మరిన్ని ఇవ్వగలరు.

–మురళీధర్, విజయవాడ.

చట్టం తనపని తాను...?!

24వ తేదీ సంచికలో జీవనశైలి శీర్షికలో 'చట్టం తన వని తాను చేసుకెళ్ళుతోందా?' వ్యాసం చక్కని విషయాలు చెప్పింది. అక్కరకురాని చుట్టం అన్నట్లు నడుస్తున్న (అ)ప్రజాస్వామిక, (అ)ప్రయోజక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవస్థలో నేరస్తులకు తక్షణమే తగు శిక్షలు లేకపోవడం నేరాల సంఖ్య మరింత పెరిగిపోవడానికి కారణం.

–సిరిపురపు సంపూర్ణచంద్రిక,
ఎనికేపాడు, విజయవాడ రూరల్.

సీజన్‌పండుగలు - పండగ సీజన్లు!!

సీజన్‌ల ప్రకారం వచ్చే పండగలు మామూలేనండి...

కొన్నిటిని పండగ్గా మలుచుకుని తమ సీజన్‌గా చేసుకునేవి వేరేవండయ్యా...

ఇప్పుడు...వినాయకచవితి, దసరా, దీపావళి, రంజాన్, క్రిస్టమస్‌ల్లాంటివి ఉన్నాయనుకోండి... వాటి సీజన్ ప్రకారం ఎప్పుడూ వచ్చే పండగలన్నమాట ఉన్నమాటే కదండి!

రిపబ్లిక్ డే, ఇండిపెండెన్స్ డే ల్లాగే ఈరోజుటి చిల్డ్రన్స్ డే, ఇరవయ్యో తేదీనాటి వరల్డ్ చిల్డ్రన్స్ డే ల్లాంటివి కూడా వాటి డేట్‌ల ప్రకారం సీజనల్‌గా వచ్చే సుదినాలే అనుకోండి.

రక్తదాన వారోత్సవాలు, రోడ్డు భద్రతా వారోత్సవాలు, మొన్నటివారం జరిగిందే... అవినీతి నిరోధక వారోత్సవాలు ల్లాంటివాటిని పండగలుగా మలుచుకుని తమ సీజన్‌గా క్యాష్‌చేసుకునే మహానుభావులుకూడా ఉన్నారు మరి!

అలాంటి సరికొత్త సీజను మరోహటి వచ్చింది.

హెల్మెట్ల సీజను!

ఆ సీజను ఇప్పుడు కొంతమందికి భలే పండగ.

బుర్రలు పగిలి కుటుంబాలు ఛిద్రం కాకుండా కాపాడి మన పిల్లాపాపలు పండగపూ్టట భోరున ఏడవకుండా రక్షించేందుకే ఈ 'టోపీ-యోజన' అనుకుందాం.

ఎకాఎకిన...ఉన్నాపాటున...ఇదుగో ఈ నెల నుంచే ఆ హెల్మెట్లు ధరించితీరాల్సిందేనని ఓ హుకుం జారీ చేయడం కొందరికి భలే పండగ.

సదరు ఇనుపటోపీల నిల్వస్టాకుల గుట్టల్ని లైనుగట్టించి మరీ అమ్మేసుకోగలగటం... అందుకు అదనపు రేటు గిట్టుబాటు వాళ్ళకు పండగే గదా!

ఈ తప్పనిసరిలు అప్పుడప్పుడూ ఇలా రావడం ఇంకా ఆనందదాయకమైన పండగ!!

హెల్మెట్ల ధారణ ఇప్పటికి వాయిదా వేసినా...మళ్ళీ తప్పనిసరి సీజనొచ్చినపుడు పండగే గదా!!!

✤

ఈ సంచికలో . . .

ఓరా! . . .	3
కార్టూన్ కదంబం... . . .	4
కవర్ స్టోరీ . . .	5
జీవనశైలి . . .	10
బాలల కథ . . .	11
బాలనేస్తాలు . . .	12
ఇంతిసంగతులు . . .	15
నువ్వెద్ది . . .	16
ఆరోగ్యం . . .	18
పుస్తక పరిచయం . . .	20
న్యాయసలహాలు . . .	24

ఇంకా...

ఒడి అవతల...

కథ ... 8, 9

వికసించిన మొగ్గ

రియల్ స్టోరీ ... 14

మైసూరు పరిసర ప్రాంతాలూ ఆహ్లాదకరమైనవే !

టూరిస్ట్‌గైడ్ . . . 21

రఘుపతి వెంకయ్య అవార్డు విజేత

కళాసాహితి . . . 22, 23

ఓరా!

"నేను పిచ్చికుక్కను కాను మొర్రో"

అని ఎంత మొరిగినా పాపం మిడ్నాపూర్ కుక్కలు ప్రాణభీతితో పరుగులు పెట్టాల్సివస్తోంది. ఎంత పరుగులుతీసి నురగలు కక్కినా...సదరు మున్సిపాలిటీవారు ప్రకటించిన బహుమతికి ఉత్తిపుణ్యాన ఎక్కడ దొరికిపోతామా అని తెగ బెదిరిపోతున్నాయి. 'పిచ్చికుక్కను చంపినచో రెండువందల రూపాయలు బహుమతివ్వబడును' అని మున్సిపాలిటీవారు దండోరా వేశాక అనవసరమైన చోటకూడా తోకముడవాల్సివస్తోంది. "ఏదన్నా కుక్కను చంపేముందు దానికి పిచ్చికుక్క అని పేరుపెట్టు" అనే సామెతకూడా ఉండటంతో రెండొందల రొక్కంకోసం మంచి శునకాలక్కూడా పిచ్చికుక్క అనే టైటిల్ తగిలించేసే ప్రమాదం వచ్చిపడింది. అందుకే ఇలా 'నేను పిచ్చికుక్కను కాను' అనే బోర్డు మూర్ఛబిళ్ళకన్నా పెద్దది తగిలించుకు తిరుగుతున్నాయి.



అరచేతిలో... మైక్రో-చిప్స్!!

ఇకపై 'అరచేతిలో వైకుంఠం' అనే సామెతకు కాలం చెల్లిందనిపిస్తోంది. ఇదుగో చేస్తా...అదుగో చేస్తా అంటూ ఎంతగా మాయబుచ్చాడో చెప్పడానికుపయోగపడే ఈ సామెతకు ఎక్స్‌పెయిరీ డేట్ రాస్తోంది "చిప్ అండర్ స్కిన్" అనే ప్రయోగం. ఇటీవలే ఒక అమెరికా కంపెనీ వైద్యప్రయోజనాలకై మానవశరీరంలో మైక్రో-చిప్స్ ఉంచుకోవడానికి అనుమతినిచ్చింది. అరచేతిలో పెట్టించుకున్న ఈ చిప్స్‌లో ఆ చేతి యజమాని బ్లడ్‌గ్రూప్-మెడికల్ రిపోర్టులు, పాస్‌పోర్టు-ఐడెంటీ కార్డు వివరాలు అన్నీ పొందుపర్చి వుంచుకోవచ్చునట. సదరు వ్యక్తి ఎక్కడన్నా పడిపోతే ఈ అరచేతిలో 'వైకుంఠమ్స్'ను వెంటనే స్కాన్‌చేసి ఆ వ్యక్తి వివరాలు ఇట్టే తెలుసుకోవచ్చు. అంతేకాదు చిప్స్ పొదిగించుకున్న వ్యక్తి ఎక్కడన్నా కిడ్నాపుకి గురైతే ఎక్కడ దాచబడ్డాడో కూడా కనుక్కోగలరుట. వారెవ్వా...మైక్రో చిప్స్...వారెవ్వా!!

మెడల్ రాక చస్తుందా...!?

ఓవర్‌యాక్షన్లకు తమిళసినిమా పెట్టింది పేరు. ఎందుకనంటే తమిళనాట అన్నీ ఓవరే మరి! ఆ 'అతి' అవార్డులు పొందడంలో కూడానట! మరందుకే...అవార్డు ఇవ్వడానికో, పుచ్చుకోడానికో ఏదో ఒక సంస్థ ఇట్టే పుట్టేస్తుంది. స్థానిక సంస్థయితే వెంటనే ఇబ్బంది, పుట్టించేదేదో విదేశీ అయితే మరింతసేపు ఆ ఓవరాక్షన్ నిలబడుద్ది. కిందటేడు డి.ఎం.కె. నాయకుడు స్టాలిన్‌కి 'మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్' అనబడు ఒక అవార్డు ఐరిష్ యూనివర్సిటీ ద్వారా దక్కింది. అందుచేతనూ...ఈ ఏడాది ఎఐడియంకె నాయకమ్మణి, పురిచ్చితలైవి, తమిళప్రజల ముఖ్యమంత్రి కుమారి జె జయలలిత గారికి 'గోల్డెన్ స్టార్ ఆఫ్ ఆనర్ అండ్ డిగ్నిటీ' అవార్డు ఇచ్చారు. ఉక్రెయిన్‌కు చెందిన "హ్యూమన్ రైట్స్ డిఫెన్స్ కమిటీ" వారు ప్రసాదించారుట! హక్కులన్నవాణ్ణి చావదన్నినప్పటికీ, హైకోర్టు తీర్పు అంటూ ఎన్జీవోలనింటికి పంపబోయినప్పటికీ... లింగవివక్షను అరికట్టిన ఘనతకు ఆ అవార్డు ప్రదానం చేశారుట! కాకపోతే ఆ హ్యూమన్ రైట్స్ డిఫెన్స్ కమిటీ... ఉక్రెయిన్‌లో ఏ అడ్రస్సులో ఉంటుందీ అనేది మాత్రం అడక్కూడదని ప్రశ్న...!

కార్టూన్ కదంబం



మనం కూడా బంజారాహిల్స్, జూబిలీహిల్స్ పోదాం...
కరువు ప్రాంతాలుగా బంజారాహిల్స్, జూబిలీహిల్స్



ఇప్పుడు పిలిస్తే ఏ పార్టీ వాళ్లు రారని...
దేశం
మూడో ఫ్రంట్‌కు సమయం రాలేదు —బాబు
నారు



ముందుమాట వాళ్లు రాస్తామంటున్నారు మేడం!
అద్వానీ
ప్రధాని ఎందుకు కాలేదు? పుస్తకం రాస్తా: సోనియా

చిట్టి పొట్టి నానీ చంటీ బుజ్జి బేబీ చిన్ని కన్నా వగైరా వగైరా...

ఈ లోకం ఇంత అందంగా, ఈ మాత్రం ఆనందంగా వుండటానికి కారణమైన మా ముద్దుల పిల్లలూ! మీ కివే మా శుభాకాంక్షలు.

ఈ రోజు మీదే. అంటే ఇండియాలో పిల్లలది. మరో ఆరు రోజులకు నవంబరు 20 వస్తుంది. ప్రపంచ పిల్లల దినోత్సవం. అదీ మీ కోసమే. ఆ రోజున ప్రపంచ మంతా బాలల దినోత్సవం అన్నమాట. అందుకే మీతో మాట్లాడాలను కుంటున్నాం.

తెలకపల్లి రవి



ప్రియమైన పిల్లలారా...

ప్రియాతిప్రియమైన చిన్ని నేస్తాలూ!

మేమెవరమంటారా? మీ అమ్మలం, నాన్నలం, మామయ్యలం, బాబాయిలం, తాతయ్యలం, నానమ్మలం, టీచర్లం, అంకుల్స్‌ము, ఆంటీలమూ.. మేమే.. రోజూ మీతో మాట్లాడుతూ మిమ్మల్ను చూసి మురిసిపోతూ వుంటాం! మాకందరికీ ఒకే కోరిక. మీరు చల్లగా వుండాలి. చక్కగా పెరగాలి. అల్లరి పనులు చేయొద్దని, ఆకతాయితనం వద్దని కోప్పడుతుంటాము. కాని నిజంగా అయితే మీ అల్లరి కూడా మాకు ముద్దే. అసలు పిల్లలు అల్లరి చేయకుండా వుంటారా? అది మరీ ఎక్కువయినప్పుడే ఇబ్బంది. మీ అల్లరి చూస్తుంటే మా చిన్నతనం గుర్తొస్తుంటుంది మాకు. ఆ కబుర్లు వినాలని మీకూ చాలా ఇష్టం కదా! అందుకే తీరిక దొరికినప్పుడల్లా అడిగి మరీ చెప్పించుకుంటారు. మీ నాన్న... వాళ్ల నాన్నతోనో మాష్టారితోనో దెబ్బలు తిన్నాడని, అల్లరి పనులు చేశాడని వింటుంటే భలే సరదాగా వుంటుంది కదా! ఎవరైనా ముందు పిల్లలై తర్వాతే పెద్దలవుతారు కదా.. అలాగే మీరూ పెరిగి భవిష్యత్తును నిర్మిస్తారని మాకు తెలుసు. నేటి బాలలే రేపటి పౌరులు అన్నారు కదా. నిజం చెప్పాలంటే రేపటి నాయకులు, సైంటిస్టులు, సోల్జర్లు కమాండర్లు, పైలెట్లు, డాక్టర్లు, జడ్జీలు, ఇంజనీర్లు, టీచర్లు, కవులు-కళాకారులు అందరూ మీలోనే వుంటారు, మీ నుంచే వస్తారు. మిమ్మల్ను చూస్తుంటే మా నిన్నటి చిన్నతనం, రేపటి మీ పెద్దతనం రెండూ కళ్లముందు కదలాడతాయి. మా ఆశలూ విశ్వాసాలు అన్ని మీ పైనే పెట్టుకుని వుంటాము. అందుకే మీరంటే మాకంత ఇష్టం.



గొప్పవాళ్లందరికీ మీరే ఇష్టం....

మేమే కాదర్రా, ప్రపంచంలో గొప్ప వాళ్లందరూ పిల్లలను ఎంతగానో ఇష్టపడేవారు. గాంధీ గారు స్వాతంత్ర్యం కోసం పోరాడుతూన్న రోజులలో కూడా ఏ మాత్రం సమయం చిక్కినా పిల్లలతో గడిపేవారు. వారి మాటలు వినేవారు. ఆయన పక్కన ఒక చిన్న పాప కూచుని వుండే ఫోటో ఎప్పుడైనా చూశారా? ఆ పాపే ఇందిరాగాంధీ. తర్వాత ఈ దేశానికి ప్రధాని అయ్యారు. గాంధీ తర్వాత మనకెంతో ఇష్టమైన నాయకుడు జవహర్‌లాల్ నెహ్రూ. వాళ్లనాన్న మోతీలాల్ కూడా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నవారే. నెహ్రూ దేశం కోసం ఎన్నో సార్లు జైలుకెళ్లారు. స్వాతంత్ర్యం వచ్చాక మనకు మొదటి ప్రధాన మంత్రి అయ్యారు. ఆయనకూ పిల్లలంటే చాలా ఇష్టం. అందుకే ఆయన జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకొంటున్నాము.

మీకు కారల్ మార్క్స్ తెలుసా? ప్రపంచంలో పేదరికం, అన్యాయాలు పోవాలని, అందుకోసం మనమంతా పోరాడి సోషలిజం తెచ్చుకోవాలని చెప్పారు. కమ్యూనిస్టు సిద్ధాంతం కనిపెట్టారు. ఆ మార్క్స్ తాతయ్య కూడా పిల్లలంటే ఎంతో ఇష్టపడేవారు. రాత్రింబవళ్ళు గుట్టలకొద్దీ పుస్తకాలు చదివి, జనం కోసం పోరాడిన మార్క్స్ టైము దొరికిందంటే పిల్లలతో ఆడుకునేవారట. వాళ్లను గుర్రం ఎక్కించుకుని తిప్పేవారు. కథలు అల్లుతూ చెపుతుండేవారు.

మీకు శ్రీశ్రీ తెలుసా? తెలుగులో మహాకవి. ఆయన ఏమన్నారో తెలుసా?

పిట్టల్లారా! పిల్లల్లారా!
వానకురిస్తే మెరుపుమెరిస్తే
ఆకసమున హరివిల్లు విరిస్తే
అది మాకే అని ఆనందించే
ఉడతల్లారా బుడతల్లారా!
మీదే మీదే సమస్త విశ్వం
మీరే లోకపు భాగ్య విధాతలు

మీకు కోపం రాదు కదా!

మహాకవులు, మహానాయకుల నుంచి మీ అమ్మానాన్నల వరకూ పిల్లలనెందుకు ఇంతగా ప్రేమిస్తారో అర్థమైందా? మీకూ వాళ్లంటే ఎంతో ఇష్టం కదా! మాకు తెలుసు. ముఖ్యంగా మీరందరూ మీ అమ్మ గురించి ఎప్పుడూ ఆలోచిస్తుంటారు. అమ్మ చెప్పే మాటలు అనుకుంటుంటారు. అమ్మకు కోపం రాకుండా ఒప్పించి మీ పని జరిపించుకోవాలని చూస్తుంటారు. ఒకోసారి దెబ్బలు



కూడా తింటుంటారు. అయినా మీకు అమ్మలూ నాన్నల మీద, టీచర్ల మీద కోపం రాదు. అంతలోనే అన్నీ మరచిపోయి హాయిగా ఆడుకుంటారు. పెద్ద వాళ్లు మెచ్చుకుంటే మాత్రం ఎంతో సంతోషిస్తారు, అవునా?

ఇందాకే చెప్పాను కదా, పెద్దవాళ్లు కోరుకునేదొక్కటే. మీరు బాగుండాలని. అలా వుండాలంటే ఏం చేయాలి మరి?

చదువే ఫస్ట్

పిల్లల మొదటి పని బాగా చదువుకోవడం. అమ్మా నాన్న ఎంతో కష్టపడి, ఇష్టపడి మిమ్మల్ని చదివిస్తారు. చదువులో మీరు బాగా ముందుండాలని కోరుకుంటారు. స్కూలులో టీచర్లు కూడా అదే కోరుకుంటారు. చదువుకుంటూ మీరు కాస్త అల్లరి చేసినా పోనీలే అని సర్దుకుంటారు. పిల్లలన్నాక ఆటాపాటా వుండాల్సిందే. అల్లరీ చెయ్యాల్సిందే. కాని చదువు వదిలేసి అల్లరి పనుల్లో మునిగిపోకూడదు. చదువు ముందు, సరదాలు తర్వాత అని అర్థం చేసుకోవాలి. మీ కన్నా చిన్న పిల్లలకు చెప్పాలి.

చదువుకోవడానికి ట్రై చేస్తున్నా అర్థం కావడం లేదనుకోండి. పెద్దవాళ్లకు చెప్పాలి. మీకు ఎక్కడ ఇబ్బందో అది భయం లేకుండా చెప్పెయ్యాలి. అప్పుడు మీకు ఎలా సహాయం చేయాలో వాళ్లు ఆలోచిస్తారు. అర్థం కాకున్నా అయినట్టు చేస్తుంటే చివరకు పరీక్షలు దగ్గరకొచ్చాక ఎవరూ ఏమీ చేయలేరు. కనుక చదువుకోవడం ముఖ్యం.

టీవీతోనే గడిపేస్తే టైం వేస్టే!

చదువుకుందామంటే చాలా సమస్యలు అడ్డొస్తాయి కదా. ముఖ్యంగా టీవీలు.. ఎప్పుడూ ఏవో సీరియల్స్, కామిక్స్, సినిమాలు, క్రికెట్లు అబ్బబ్బ వాటిని చూడకుండా చదువుకొమ్మంటే అన్యాయం కదా.. అనిపించొచ్చు కొందరికి. కానీ చేస్తాలా, అవన్నీ చూడాల్సిందే. కాని చదువయ్యాకే. ఆ మాత్రం క్రమశిక్షణ మీరు పాటించాలి. అసలే ఈ రోజుల్లో మీకు బోలెడన్ని సబ్జెక్టులు సిలబస్.. కష్టమైనా తప్పదు మరి. టైమంతా టీవీల ముందు పోగొట్టుకుని తర్వాత లబోదిబో మంటే లాభమేముంటుంది? కనక మీరు మీ పెద్దవాళ్లు కోరుకుంటున్నట్టు ముందుకు పోవాలంటే టైం వేస్టు చేయకూడదు. టీవీలలో వచ్చే కార్యక్రమాలన్నీ మంచివని అనుకోకండి. మంచివి వున్నట్టే చెడ్డవి కూడా చాలా వుంటాయి. ఒకటి చెప్పండి- కొన్ని టీవీ సీరియల్స్‌లోగాని, సినిమాల్లో గాని వూరికే పొడుచుకోవడం, చంపుకోవడం, రక్తం కారడం ఇవన్నీ మీకు నచ్చుతాయా? కష్టంగా వుండదూ? ఇవన్నీ నిజంగా జరిగేవి కాదు కదా! కాని కొంతమంది పిల్లలు ఈ సంగతి తెలుసు



కోలేక టీవీల్లో లాగా చేయాలనుకుని అన్యాయంగా ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటున్నారు. శాస్త్రజ్ఞులు పరిశోధనలు జరిపి ఈ విషయం తేల్చారు. కాబట్టి మీరు మంచి కార్యక్రమాలు మాత్రమే చూడండి. అది కూడా మీ చదువులకు ఇబ్బంది లేకుండా. టీవీలలో చూసినట్టుచేయాలనుకోకండి. దానివల్ల పిల్లలకు చాలా నష్టం కలుగుతున్నదని మన పిల్లల డాక్టర్లే చెబుతున్నారు. ఇంకొన్నిసార్లు సినిమాలు, టీవీలలో ఏవో అసహ్యమైన కార్యక్రమాలు కూడా చూపిస్తుంటారు. మంచి పిల్లలు అలాటివి రాగానే టీవీలు కట్టేస్తారని మాకు తెలుసు. అలాగే మీ స్నేహితులకు కూడా చెప్పాలి.

బుట్టలో పడతారా?

ఇంకో ముఖ్యమైన సంగతి. టీవీలలో ఎప్పుడూ అదీ ఇదీ అడ్వర్టయిజ్‌మెంట్లు వేస్తుంటారు. మిమ్మల్నీ బుట్టలో వేసి తమ వస్తువులు అమ్ముకోవాలని వాళ్ల ప్లాను. ఎవరైనా మీ దోస్తు వాడిని వాడు పొగుడుకుంటే మీరు నమ్ముతారా? ఇదంతా స్వంత డబ్బా అంటారు కదా. ఈ అడ్వర్టయిజ్‌మెంట్లు కూడా అంతే. తమ గురించి తామే గొప్పలు చెప్పి మనలను కొనుక్కోమంటారు. కాని మనం వాళ్ల మాటలు గుడ్డిగా నమ్మేస్తే వెర్రి వెంగళప్పలమై పోతాము. కొంత మంది నేస్తాలు అవే నమ్మేసి ఆ పేస్టు కావాలని, ఈ చాక్లెట్ కావాలని పేచీలు పెడుతుంటారు. నిజంగా ఇది



పొరబాటు. పిల్లలను బుట్టలో వేసుకోవడం అంత తేలికేమీ కాదని మీరు ఆ అడ్వర్టయిజ్‌మెంట్ల వాళ్లకు చెప్పాలేగాని మోసపోకూడదు.

ఆటపాటలు, కళలు నేర్వాలి

మరి మాకు టైంపాస్ ఎలా అని అంటున్నారా? వూరికే పాఠాలే చదువుతూ కూచోమంటారా అని కోపం తెచ్చుకోవద్దు. పిల్లలు చదువుతో పాటు మంచి ఆటలు, కళలు కూడా నేర్చుకోవలసిందే. చదువకోవడానికి పోగా సమయం మిగిలితే మీరు బాగా ప్లాను చేసుకోవాలి. నేస్తాలతో కలసి మంచి ఆటలు ప్రాక్టీసు చేయాలి. కోనేరు హంపి చదరంగంలో, సానియా మీర్జా టెన్నిస్‌లో ఎంత పేరు తెచ్చుకున్నారో చూశారు కదా! అలాగే జనరల్

తెలుసుకుందాం!

- భారత స్వాతంత్ర్య పోరాటం, వీర తెలంగాణా రైతాంగ పోరాటం, అక్టోబర్ విప్లవం వంటి వాటి గురించి,
- కారల్ మార్క్స్, లెనిన్, గాంధీ, నెహ్రూ, వీరేశలింగం, అల్లూరి సీతారామరాజు, పొట్టి శ్రీరాములు, సుందరయ్య, అంబేద్కర్ వంటి నాయకుల గురించి
- వీరేశలింగం వంటి సంస్కర్తల గురించి,
- ఐన్‌స్టీన్, న్యూటన్, సి.వి.రామన్ వంటి సైంటిస్టుల గురించి

నాలెడ్జ్ పెంచుకోవచ్చు. ఈ రోజుల్లో ఎంతో మంది పిల్లలు చిన్నవయస్సులోనే బోల్డంత విజ్ఞానం సంపాదించేస్తున్నారు. టీవీలతోపాటు ఇంటర్‌నెట్ వంటివి కూడా ఇప్పుడు అందుబాటులో వున్నాయి కదా. పెద్దల సహాయంతో మీరు వీటిని ఉపయోగించడం నేర్చుకోవాలి. మన నాయకులు, మహాకవులు చిన్నతనంలో ఇవన్నీ లేకపోయినా పుస్తకాల ద్వారానే ఎన్నెన్నో విషయాలు తెలుసుకున్నారు. అసలు చిన్నప్పుడు చదువుకోకపోతే తర్వాత అవకాశం దొరకడం కష్టం. పై చదువులు, ఉద్యోగాలు ఇవే సరిపోతాయి.

తల్లిదండ్రులు, టీచర్లు కూడా ఎప్పుడూ పాఠాల గురించే మాట్లాడుతుంటే మీకు చికాగ్గా వుంటుంది కదా. నిజమే. వాళ్ల భయం వాళ్లది. మీరు వెనకబడి పోతారని. అందుకే మీరు చకచకా చదవాల్సింది పూర్తి చేస్తే అప్పుడు ఆటపాటలు, కళలు చూసుకోవచ్చు. శిశుర్వేత్తి పశుర్వేత్తి అని సంగీతాన్ని అన్నారు. అంటే పిల్లలకైనా పాటలు ఇష్టం అని. మీరు మంచి పాటలు నేర్చుకోవడానికి ప్రయత్నం చేయండి. హాయిగా పాడుకుంటే మీకు, మీ చుట్టుపక్కల వాళ్లకు కూడా చాలా ఉత్సాహంగా వుంటుంది. మీ అమ్మా నాన్నలు ఎంతో సంతోషిస్తారు. పాత పాటలు, కొత్త పాటలు కూడా మీరు నేర్చుకోవచ్చు. కాని చెత్త పాటలు మాత్రం వద్దు. పద్యాలంటే మీకు నచ్చుతాయా? అన్నీ కాకున్నా కొన్ని మంచి అర్థం వచ్చే పద్యాలైనా, వేమన పద్యాలు సుమతి పద్యాల వంటివి నేర్చుకోండి. మీకెంతో ఉపయోగపడతాయి. మీకు తోడుగా వుంటాయి. అలాగే బొమ్మలు వేయడం, ఏవైనా చేతి పనులు చేయడం కూడా.

కష్టాలు పడేవారున్నారు...

అన్నట్టు మీలో కొంత మంది డబ్బు వున్న

చదువుకుందాం!

- వేమన, గురజాడ అప్పారావు, శ్రీశ్రీ, ఆరుద్ర, మాగ్జిం గోర్కి వంటి మహాకవులు, రచయితల రచనలు,
- కారల్ మార్క్స్, తదితరుల సిద్ధాంతాలు

నేర్చుకుందాం

- ఆటపాటలు,
- కళలు,
- కంప్యూటర్, ఇంటర్‌నెట్ వంటి సాంకేతిక నైపుణ్యాలు,
- ఆత్మరక్షణ పద్ధతులు,
- వ్యాయామం

వాళ్లు కావచ్చు. కాని అలాటి వాళ్లు తక్కువగానే వుంటారని నాకు తెలుసు. ఎందుకంటే మన దేశంలో, అసలు ప్రపంచంలోనే డబ్బులేని పేదవాళ్లు ఎక్కువ. పేద వాళ్ల పిల్లలు ఎలా వుంటారో చూస్తూనే వుంటాం. పుస్తకాలు కొనడానికి, ఫీజులు కట్టడానికి కూడా డబ్బులు వుండవు. అలాటి వాళ్లు చదువుకోవడం ఎంత కష్టం? అందుకే కొన్ని రోజులు స్కూలుకు వచ్చి మానేస్తుంటారు. వీళ్లనే డ్రాపవుట్స్ అంటుంటారు. నిజంగా వాళ్లు మానేసేది శ్రద్ధ లేక కాదు, సాధ్యంకాక. వాళ్ల పెద్దవాళ్లు ఇలాటి వాళ్లను పనిలోకి పంపిస్తుంటారు. పల్లెల్లో అయితే పొలం పనులు చేస్తుంటారు, పశువులు కాస్తుంటారు. టౌన్లలో, సిటీల్లో అయితే మెకానిక్ల దగ్గర, హోటళ్లలో క్లీనర్లుగా పని చేస్తుంటారు. వీళ్లనే బాలశ్రామికులు అంటాము. పని చేయడం తప్పు కాదు. కాని ఆ పిల్లలు చదువుకోవలసిన వయస్సులో ఈ విధంగా చాకిరీ చేస్తూ గడపడం బాధ కలిగించదూ? ఈ విధంగా పని చేసే బాలశ్రామికులు వరకూ వుంటారంటే చూడండి మరి! పేదరికం పోతే గాని ఈ పద్ధతి పోదు. అలా జరగాలంటే ఈ సమాజం మారాలి. మార్క్స్ చెప్పినట్టు సోషలిజం రావాలి. సోషలిస్టు దేశాలైన ఒకప్పటి రష్యా, నేటి చైనా వంటి వాటికి వెళ్లి వచ్చిన వారెవరైనా అక్కడ పిల్లలు ఎంతో హాయిగా, ఆరోగ్యంగా వున్నారని చెబుతుంటారు. కారణమేమంటే అక్కడ పేద గొప్ప తేడాలు పోవడమే. అందుకే మన సాటి పిల్లల భవిష్యత్తు కోసం మనం సమాజాన్ని మార్చేందుకు పని చేయాలి. మనం ఇందాక చెప్పుకున్న గొప్పవాళ్లందరూ తమ స్వార్థమే చూసుకోకుండా దేశం, ప్రజల గురించి ఆలోచించారు. "సొంత లాభం కొంత మానుకు పొరుగువాడికి తోడుపడవోయ్" అన్నారు గురజాడ. మనం కూడా వారి బాటలో నడవాలి.

మీ చుట్టూ వుండేవాళ్లు, కొంత మంది పెద్దవాళ్లు కూడా మీరు ఇలా చేస్తామంటే ఒప్పుకోకపోవచ్చు. ముందు మీ సంగతి మీరు చూసుకోండి, ఇతరుల గొడవెందుకు అని మందలించవచ్చు. ఎందుకంటే ఈ నాటి సమాజంలో స్వార్థం ఎక్కువగా వుంది. మీరు దాని నుంచి బయటపడాలి. మనతో పాటు అందరూ అభివృద్ధి కావాలని కోరుకోవాలి. అదొక మంచి ఆశయం. మనమొక్కరమే బాగుపడాలనుకోవడం ఆశ. అందరూ బాగుండాలని కోరుకోవడం ఒక ఆశయం. మంచి పిల్లలు మంచి ఆశయాలు కూడా పెంచుకోవాలి. చెడును ఎదిరించడానికి వెనుకాడకూడదు. అలాగే ఎవరైనా మంచి పనులు చేస్తే ప్రోత్సహించాలి.

అందరం ఒక్కటే!

మీ స్కూల్లో గాని, వూళ్లో గాని చాలా మంది కుల మతాల గురించి మాట్లాడుతుంటారు కదా! మీది ఏ కులమని అడుగుతుంటారు. మన సమాజంలో కులం ఒక చెడ్డ లక్షణంగా పాతుకుపోయింది. ఇతర కులాలవాళ్లను దూరం పెట్టడం, దళితులనైతే చులకనగా చూడటం అలవాటైపోయింది. ఇది అన్యాయం అంటే మీరు ఒప్పుకుంటారు కదా! అలాగే మతం కూడా. మన దేశంలో హిందూ మత విశ్వాసాలు కలవారు ఎక్కువగా వుంటారు. కాని ముస్లిం మతాన్ని



పాటించేవారుకూడా కోట్లాదిమందివున్నారు. కొందరు క్రైస్తవ మతస్థులు కూడా వుంటారు. కాని కొంత మంది స్వార్థం కోసం ఈ మతాల మధ్య తగాదాలు పెడుతుంటారు. హిందూ ముస్లిం చీలికలు తెస్తుంటారు. మత కలహాలు కర్ఫ్యూలలో ఎంతో మంది మరణించడం గురించి మీరు వినివుంటారు కదా! ఈ గొడవల్లో చనిపోయేది ఎక్కువగా పిల్లలే. ఇదంతా ఎందుకు జరుగుతుందో ఆలోచించారా? మనందరం మనుషులమే అయినప్పుడు మనందరిలో ప్రవహించే రక్తం ఒక్కటే అయినప్పుడు కులం, మతం అంటూ ఒకరినొకరు చంపుకోవడం ఎంత తప్పు? ఇలాటి మాటలు చెప్పేవాళ్లను మీరు దూరం వుంచాలి. అసలు నేను మనిషిని , మంచి కోసం పని చేస్తాను అని తప్ప ఫలానా కులం అని, మతం అని చెప్పుకోవడమే మానెయ్యాలి. ఎవరైనా కులం అడిగితే అస్సలు చెప్పకండి. మాకు కులమతాలు లేవని చెప్పండి.

శాంతి కావాలి!

మీరు టీవీలో, పేపర్లలో ఇరాక్ గురించి చూస్తుంటారు కదా! ఔను, సద్దాం హుస్సేన్ ఆ దేశం వాడే. అమెరికా ఆ దేశంపై అన్యాయంగా దాడి చేసి వేలాదిమందిని చంపేసింది. ఇప్పటికీ అక్కడ దుర్మార్గాలు చేస్తోంది. ఇరాక్‌లో వేల మంది పిల్లలు బాంబుల దాడుల్లో చనిపోయారు. అమెరికా వాళ్లకు తిండి, మందులు అందించకుండా అడ్డుపడడం వల్ల మరెంతో మంది చనిపోయారు. అసలు ఇప్పటి వరకూ ఇలాటి అన్యాయమైన యుద్ధాలలో చనిపోయిన వారిలో ఎక్కువ మంది చిన్నపిల్లలే. అభం శుభం తెలియని పిల్లలు అంటామే వారినే ఇలా ప్రాణాలు తీయడం ఎంత అన్యాయమో ఆలోచించండి. అందుకే మనం బాలల దినోత్సవం సందర్భంలో ఇలా బలైపోతున్న పిల్లలను గురించి తలుచుకుందాం. మారణాయుధాలు, యుద్ధాలు లేని ప్రపంచ శాంతిని కోరుకుందాం.

ఈ రోజు బాలల దినం కాబట్టి ఇవన్నీ చెప్పుకున్నాం. కాని మాట్లాడుకుంటే మార్పు రాదుకదా! అందుకోసం మనమంతా పని చేయాలి. అంటే మంచి కోసం మనమంతా కలసి కదలాలి. మనలాగానే ఆలోచించే వారిని కలుసుకోవాలి. అలాటి విషయాలు తెలుసుకోవాలి. చదువుకోవాలి. ప్రచారం చేయాలి. మనం చదువుకుంటూ, మనకొచ్చిన చదువు, రాని వారికి నేర్పాలి. అమ్మలకు సాయం చేయాలి. ఇందాక చెప్పుకున్నామే అలాగా ఆటపాటలు, కళలు, ఇతర రంగాలలో అభివృద్ధి సాధించాలి. దీనంతటినీ కలిపే చైతన్యం అంటాం. అందరం చైతన్యం పెంచుకుని అన్యాయాలను ఎదిరిస్తే మన ప్రపంచం మరింత అందంగా తయారవుతుంది. రేపటి పౌరులు మీరే కనక ఈ విషయాలు ఇప్పటి నుంచి అర్థంచేసుకుని అమలు జరపవలసిన వారూ మీరే. అందుకే ఈ వారం కవర్‌స్టోరీలో మీకు ఇవన్నీ చెప్పాను. ఇంకా మరింత వివరంగా కావాలంటే మీ స్నేహితులతో కలసి వీటిని మాట్లాడుకోండి. ఇంకా అనుమానాలు మిగిలితే మీ పెద్ద వాళ్లను అడిగి తెలుసుకోండి.

మీరే రేపటి ఆశ
మీరే లోకపు శ్వాస

పెంచుకుందాం!

- కష్టపడే లక్షణం
- అర్థం చేసుకునే ప్రతిభ
- గౌరవించే వినయం
- నిలదొక్కుకునే ఆత్మ విశ్వాసం
- ప్రశ్నించే జిజ్ఞాస
- ప్రతిఘటించే ధైర్యం

ఇవి పోవాలి!

- బాలల పీడన
- వెట్టిచాకిరీ
- కుల మత వివక్ష
- మత కలహాలు
- యుద్ధాలు
- అసభ్యత, అశ్లీలత

బడి అవతల...

సత్యాజీ

ఒకే జాతి సీతాకోకచిలకలు వందలు వందలుగా వచ్చి వాలిన అందమైన పూలతోటలా ఉంది బడి. కొన్ని తరగతి గదుల్లో- తుమ్మెదలన్నీ కలిసి ఉమ్మడిరాగం పాడుతున్నట్టు పాఠాలను వల్లె వేస్తున్నారు పిల్లలు. కోకిల పాటను పారవశ్యంతో వింటున్నట్టుగా కొన్ని క్లాసుల పిల్లలు మాస్టార్ల పాఠాల్లో లీనమైపోయారు.

అది ఏడో తరగతి గది.

తెలుగు మాస్టారు పాఠం చెబుతున్నారు. మధ్యమధ్యలో ప్రశ్నలు అడుగుతున్నారు. తెలిసిన పిల్లలు హుషారుగా పైకి లేచి సమాధానం చెబుతున్నారు. తెలీనివాళ్లు బిక్కమొగం వేస్తున్నారు.

'బమ్మెర పోతన ఎవరో తెలుసా?' అడిగారు గంగన్నని.

గంగన్న భయపడుతూ లేచాడు. చేతులు కట్టుకున్నాడు. ఏం చెప్పాలో తెలీక, మాస్టారి వైపు చూస్తూ ఉండిపోయాడు.

'తెలుసా? తెలీదా?'

'తెలీదండీ' భయం భయంగా చెప్పాడు.

'ఏం తెలుసు నీకు?' అన్నారు కోపంగా.

మాట్లాడలేదు గంగన్న. తలకిందకి దించుకొని నించొని ఉన్నాడు. నీకేం తెలుసని అడిగినప్పుడు మామూలుగా అయితే మాట్లాడకుండా ఉండడు. తెలిసిన సంగతులు చాలా హుషారుగా చెబుతాడు. కానీ, తనకు తెలిసిన విషయాలు ఇక్కడ పనికిరావు. ఇక్కడ పుస్తకాల్లోని సంగతులు తెలిస్తేనే తెలిసినట్టు. లేకపోతే ఏమీ తెలీనట్టే!

స్కూల్లో చేరిన కొత్తలో ఈ మాస్టారే ఏదో ప్రశ్న అడిగారు. జవాబు తెలీదు కాబట్టి అలా నుంచుని ఉండిపోయాడు.

'తెలుసా? తెలీదా?' అనడిగితే, 'తెలీద'న్నట్టుగా తలూపాడు.

'అసలు నీకేం తెలుసు?' అనడిగారు.

అలా అడగటం మాస్టారి అలవాటు. ఆ విషయం అప్పటికి గంగన్నకి తెలీదు. ఆ ప్రశ్నతో ఏదో స్ఫురించి, నిటారుగా నిలబడ్డాడు. తనకు తెలిసిన విషయాలు చాలా ఉన్నాయి. వాటిలో ఏవి చెప్పాలో, ఏవి ముందు చెప్పాలో ఆలోచిస్తున్నాడు.

ఆ ఆలోచనల గురించి తెలీని మాస్టారు- ఇక కూర్చో అన్నట్టు సైగ చేశారు. గంగన్న గమనించలేదు. మాస్టారు మరో విద్యార్థిని లేపారు, ప్రశ్నకు జవాబు చెప్పమని.

అప్పుడు మొదలెట్టాడు గంగన్న.

'మాస్టారూ... నాకు ఈత భలే వచ్చండి! మా నేస్తాలందరి కన్నా నేనే ఫస్టు. పొద్దుటినుంచి అన్నమేళ దాకా ఈత కొడతానండి. గుమ్మిలోకి దూకానంటే అందరినీ మెడ్డీంచేత్తాను. నిలువీత, వెనకీత కూడా వచ్చండీ...'

ఏం చెబుతున్నాడో మాస్టారికి అర్థం కాలేదు.

పక్క కుర్రాడిని ప్రశ్న అడిగితే గంగన్న మాట్లాడటం, అది కూడా ప్రశ్నకు సంబంధం లేని ఈత గురించి చెప్పటం...

'ఇంకానండీ... కంజుకోడి వేట భలే వచ్చండి. నేనూ, గింజరిగాడు వేటకెళ్లామంటే పోటాపోటీ అండీ. ఆఖరికి ఒకటో రెండో నేనే ఎక్కువ తెస్తానండి...' ఊపిరి పీల్చుకొని, మళ్లీ మొదలెట్టాడు.

'ఇంకానండీ... మా ఊరి దగ్గరి సూదికొండ చివరికి గబగబా ఎక్కగలనండి. నేను ఎక్కిన చాలాసేపటిదాకా ఇంకెవరూ ఎక్కి రాలేరండి... ఒకసారండీ...'

చిర్రెత్తిపోయారు మాస్టారు. 'ఏంటీ సోది... ఆపాపు...' అని గద్దించారు.

పిల్లలు పకపకా నవ్వారు. వాళ్ల నవ్వుల్లో ఎగ తాళి, అవహేళన తెరలుతెరలుగా ధ్వనిస్తున్నాయి. క్లాసంతా అల్లరి అల్లరిగా మారిపోయింది. మాస్టారికి కోపం వచ్చింది.

బల్ల గట్టిగా చరిచి, 'సైలెన్స్' అని అరిచారు. నవ్వులు ఆగిపోయాయి. గంగన్న చెప్పటమూ ఆగిపోయింది. మాస్టారు తీక్షణంగా చూశారు. భయపడ్డాడు గంగన్న.

'కూర్చో' అన్నారు గట్టిగా.

వెలిగించి వదిలిన బాంబు ఉండుండీ పేలినట్టు మళ్లీ నవ్వులు.

'సైలెన్స్' అని గద్దించి, గంగన్న వైపు కొరకొరా చూశారు మాస్టారు.

'తెలీటమంటే కొండలెక్కటం, ఈతకొట్టటం కాదురా. ఈ పనులు చదువూ సంధ్యా లేని ప్రతి ఒక్కడూ చేస్తాడు. దానిలో లేదు గొప్ప. ఇలాంటివి ఇంకెప్పుడూ చెప్పకు. ఒళ్లు దగ్గర పెట్టుకొని చదువు' అన్నారు. వాచీ ఓసారి చూసుకొని చరచరా క్లాసులోంచి వెళ్లిపోయారు.

ఫస్ట్ పీరియడ్ పూర్తయినట్టు అప్పుడే గంట మోగింది. గది పై కప్పు ఎగిరిపోయేటట్టు నవ్వులు మళ్లీ మొదలయ్యాయి. గంగన్నకి ఏడుపొచ్చినట్టయింది కానీ, ఏడవ లేదు. అలాటి పరిస్థితిలోనూ ఏదో అర్థమయినట్టుగా అన్పించింది.

తనకు తెలిసిన విషయాలకు ఇక్కడ విలువ లేదు. ఇక్కడ చెప్పేవే విలువైన విషయాలు. వాటిని నేర్చుకుంటేనే విలువ.

* * *

ఆ సంఘటన తరువాత గంగన్న బాగా కుంచించుకుపోయాడు. ఏది మాట్లాడితే ఏం తప్పో తెలీదు. ఏం మాట్లాడాలో ఏం మాట్లాడకూడదో భయం. స్కూల్లో ఉన్నంతసేపూ మూగవాడిలా మారిపోవటం అలవాటయి పోయింది. స్కూలుకి రావటం ఎప్పుడూ మానడు. పాఠాలు శ్రద్ధగా వింటాడు. ఏదైనా అడిగితేనే నోరు పెగలదు.

మాస్టారికి ఆ విషయం అర్థమయింది.

నించొని ఉన్నవాణ్ణి కూచోమని చెప్పి, పాఠం కొనసాగించారు.

ఇంటర్వెల్ బెల్ మోగింది. పంజరం తెరిచిన పిట్టల్లా గోల చేస్తూ, పరుగులు తీశారు పిల్లలు. క్లాసు రూములు బోసిపోయి, గ్రౌండ్ కళకళ్లాడుతోంది. ఎగరలేని పక్షిపిల్లల్లా పుస్తకాలు ఒంటరివైపోయాయి. ఆ పుస్తకాల మధ్య గంగన్న ఒక్కడే మిగిలాడు.

* * *

ఆ రోజు బడి విడిచిపెట్టాక సంచి సర్దుకొని ఇంటికి వెళ్లిపోబోతుంటే- తెలుగు మాస్టారు పిలిచారు. ఎందుకోసమా అని జంకుతూ వెళ్లాడు.

'రేపు మీ ఊరు వస్తాను. ఓటరు లిస్టు రాయాలి. ఆదివారం కదాని కొండలూ కోనలూ ఎక్కేయకుండా కాస్త ఇంటి దగ్గరే ఉండు' అన్నారు.

ఆ రోజు రాత్రి గంగన్న నిద్రపోలేదు. ఎప్పుడు తెల్లారుద్దా అని తెల్లార్లూ అనుకుంటూనే ఉన్నాడు. పొద్దున్నే లేచి నేస్తాలను వెంటబెట్టుకొని ఊరవతల చింతచెట్టు దగ్గర కాపలాకు దిగాడు. ఒక్కొక్క నిమిషం ఒక్కొక్క యుగంలాగ ఉండి, ఆఖరికి నిరీక్షణ కష్టంగా ఉండి, మాస్టారు ఎక్కడి దాకా వచ్చారో ఎదురెళ్లి చూద్దామని బయల్దేరి, నడుచుకుంటూ నడుచుకుంటూ, పొలిమేరలు దాటి, కొండెక్కి దిగి, ఏకంగా మాస్టారింటికి వచ్చేశాడు నేస్తాలతో సహా.

గంగన్నని చూసి మాస్టారు ఆశ్చర్యపోయారు.

'నేను మీ ఊరు వస్తానంటే నువ్వేంటి ఇలా వచ్చావు' అన్నారు.

'అదీ..., మీ కోసమేనండీ పొద్దున్నుంచి చూస్తున్నాం.

చూసిచూసీ మీరు రాకపోయేసరికి తోవలో ఉన్నారేమోనని చూసుకుంటూ వచ్చేశాం' అన్నాడు. మాస్టారు తల తిప్పి చూస్తే- ఇంటికి దూరంగా, ఒంటి మీద చొక్కాల్లేకుండా చిరుగుబొరుగు పంట్లాలు వేసుకున్న నలుగురు పిల్లలు తమవైపే చూస్తూ కన్పించారు.

'వాళ్లనిలా పిలువ్' అని చెప్పి, ఇంట్లోకెళ్లి అందరికీ స్వీట్లు తెచ్చిచ్చారు. అప్పుడు టైం ఏడున్నర. ఇంటి పనులు చూసుకొని ఎనిమిదిన్నర - తొమ్మిది మధ్య బయల్దేరదామనుకున్న ఆయన ఎనిమిదింటికే బయల్దేరారు.

పుస్తకాల సంచి భుజానేసుకొని నడుస్తున్నాడు గంగన్న. ఆ వెనక మాస్టారు, ఆయన వెనక గంగన్న నలుగురు నేస్తాలూ.

గంగన్న వాళ్లూరు ఓ గిరిజన పల్లె. ఆరేడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఐదు వరకూ ఊళ్లోనే చదివాడు. ఐదుదాటి, ఆ కొండ దాటి పిల్లలెవరూ రారు. గంగన్న చురుగ్గా ఉన్నాడని ఓ మలేరియా వర్కర్ గమనించి, ఈ స్కూల్లో చేర్పించాడు. కొంచెం మట్టి రోడ్డు, తరువాత ఓ మాదిరి కొండ, అది దిగి ఇంకొంచెం దూరం నడిస్తే ఊరొస్తుంది. సైకిలు కూడా వెళ్లే అవకాశం లేదు. కాలి నడక ఒక్కటే శరణ్యం. గట్టిగా నడిస్తే గంట ప్రయాణం. ఆ దారంట నడవటం గంగన్నకి కొట్టినపిండే.

* * *

నడుస్తున్నకొద్దీ మట్టిరోడ్డు సన్నని కాలిబాట అయిపోయింది. బాట బాగా నలిగి ఉన్నా అక్కడక్కడ రాళ్లూ ముళ్లూ పడి ఉన్నాయి. నడుస్తూ నడుస్తూ ఓ రాయిని తన్నుకొని తూలి పడబోయారు మాస్టారు. అమాంతంగా వెనక్కి తిరిగి మాస్టారి చెయ్యందుకున్నాడు గంగన్న.

అప్పుడు చూశారు మాస్టారు గంగన్న కాళ్లవైపు. చెప్పుల్లేవు. వెనక్కి తిరిగి చూశారు. ఆ నాలుగు జతల పాదాలక్కూడా లేవు. గంగన్న చాలా వేగంగా నడుస్తున్నాడు. నడకలో చలాకీతనం, చురుకుదనం తాండవిస్తున్నాయి. మాస్టారు అడుగులు నెమ్మదిగా పడుతున్నాయి. రాళ్ళూరప్పలూ జాగ్రత్తగా చూసుకుంటూ నడవాల్సివస్తోంది. ఏమరుపాటుగా ఉంటే ఇందాకటిలాగా ఏ రాయినో తన్నాల్సివస్తుందని భయం. మాస్టారికి చిరుచెమట, కొద్దిపాటి ఆయాసం మొదలయ్యాయి.

ఏదో పెద్దచెట్టు కనిపించేసరికి సేద తీరాలని ఆగారు. రుమాలు తీసుకొని ముఖం తుడుచుకున్నారు. ఇంటి దగ్గర నుంచి తెచ్చుకున్న నీళ్ల సీసాలోంచి కొద్దిగా నీళ్లు తాగారు. గంగన్నని తాగమంటే – కొండెక్కి దిగితే గెడ్డ వస్తుందని, అక్కడ తాగుతామని చెప్పాడు. నేస్తాలు కూడా అదే మాటన్నారు.

చెట్టుపైకి చూసి, 'ఇది ఏం చెట్టో' అని తనలోతానే అనుకుంటున్నట్టుగా పైకే అన్నారు మాస్టారు.

'ఇది నల్లజీడి చెట్టండి. దీని పళ్లు కాల్చుకుని తింటే భలే ఉంటాయండి. పిక్కలు వాతానికి పనికొస్తాయండి. వాటితో దిష్టి కూడా తీస్తారండి. గేదెలకి మెళ్లో దండలు గుచ్చేచ్చుండి. పిల్లల మొలతాడుకి కూడా కడతారండి.'

టకటకా చెప్పేశాడు గంగన్న.

'ఇదిగోండి... వీడికి చూడండి..' అని చిలకగాడిని పిలిచి, వాడి మొలతాడు పైకి లాగి చూపించాడు. నల్ల జీడిపిక్కకు ఇటూఅటూ ఎర్రటి పూసలు చేర్చి, అవి చెదిరిపోకుండా అందంగా ముడులు వేసి ఉందది.

మాస్టారు అభినందనపూర్వకంగా నవ్వారు. చిలకగాడు కాస్త సిగ్గు పడ్డాడు.

'నాకు తెలియని చెట్టు గురించి, దాని ఉపయోగాల గురించి గంగన్నకి ఎంత బాగా తెలుసు' అనుకున్నారు మాస్టారు. గంగన్న గురించి అలా అనుకోవటం అదే మొదటిసారి.

సేద తీరాక నడక మళ్ళీ మొదలయింది. కొంతసేపటికి కొండ ఎక్కడం మొదలయింది. గంగన్న కాళ్ళు చకచకా కదులుతున్నాయి. మాస్టారికి మాటిమాటికీ ఎగ ఊపిరి తన్నుకొస్తోంది. పదేపదే ఆగాల్సి వస్తోంది. ఆగిన ప్రతిసారీ కాసిన్ని నీళ్ళు తాగితేనే అలసట తీరినట్టుంటుంది.

కాసేపట్లో దిగుడు ప్రయాణం మొదలయింది. ఇందాకటికన్నా సులభంగా, వేగంగా సాగుతోంది నడక. ఆ కొండ విశేషాలు చెప్పమని అడిగారు మాస్టారు. నడుస్తున్నవాడల్లా ఉన్నపళాన గిరుక్కున వెనక్కి తిరిగి చూశాడు గంగన్న. నవ్వుతూ మళ్ళీ అడిగారు మాస్టారు.

గంగన్న కళ్ళల్లో సంభ్రమం! అప్పుడు మొదలెట్టాడు.

కొండ సిగలనుంచి ఉరికే జలపాతంలా ఉంది మాటల వేగం. ఉధృత ప్రవాహంలా ఉంది వాడి ఉత్సాహం. జోలెడన్ని కబుర్లు. చెట్లగురించి, మొక్కలగురించి, పూలగురించి, రకరకాల పండ్ల గురించి ఎన్నెన్నో విశేషాలు. పిట్టలగురించి, జంతువుల గురించి, వాటి స్వరూప స్వభావాల గురించి హావభావాలతో సహా వర్ణనలు. వీటన్నింటిలో తన, తన మిత్రుల, తన ఊరివాళ్ళ స్వీయానుభవాలూ... ఎంతో సజీవంగా, సహజంగా, సంతోషంగా సాగిపోతున్నాయి కబుర్లు.

కొత్త సంగతులు తెలుస్తున్నాయి మాస్టారికి. ప్రకృతి ఒడిలో సాగిపోతూ, ప్రకృతి సోయగాలను ఆస్వాదిస్తూ, ప్రకృతి గురించి తెలుసుకోవటం చాలా కొత్తగా ఉంది. అది కూడా తరగతి గదిలో భయంభయంగా కూచొని, ఏమీ తెలియనివాడని ముద్ర పడిపోయిన గంగన్న చెబుతుంటే వినటం ఒక సరికొత్త అనుభవంలా ఉంది.

మాస్టారి ఆలోచనలు పరిపరివిధాలు పోతున్నాయి. అవి పాత అభిప్రాయాలను పటాపంచలు చేసి, కొత్త అనుభవాలను, అంచనాలను ప్రతిష్టిస్తున్నాయి.

గంగన్న చెబుతున్న విషయాలూ, విశేషాలూ, అనుభవాలూ అంతరంగాలూ.... అన్నింటినీ ఒకచోట చేర్చి రాస్తే ఎన్ని పాఠ్యపుస్తకాలు అవుతాయి? ఎవరు రాయగలరు అవన్నీ? అసలు ఎవరు గుర్తిస్తారు ఇదంతా? ఏ రాళ్ళున్నాయి వాటిని తూచటానికి? ఏ పరికరాలున్నాయి కొలవటానికి? ఈ విజ్ఞానాన్ని చూసే శక్తి లేని తాము- వాళ్ళ పరిధిలో లేని విషయాలతో ముడిపెట్టి, మొద్దువెధవనో, బుద్ధావతారమనో ముద్రలు వేయటం పద్ధతేనా? న్యాయమేనా?

ఇన్నాళ్లూ ఏదో తప్పు చేసిన భావం కలిగింది మాస్టారికి.

కొండ దిగటం పూర్తయింది. ఇంకొంచెం నడిచాక, గెడ్డ వచ్చింది.

గంగన్న, నేస్తాలూ కాళ్లూ చేతులూ కడుక్కున్నారు. ముఖంపై నీళ్ళు జల్లుకున్నారు. నిన్న రాత్రి కొద్దిపాటి వర్షం కురవటంవల్ల నీళ్ళు బురదరంగులో ఉన్నాయి. తాగటానికి పనికిరావు. అందరికీ దాహం ఎక్కువగానే వేస్తోంది.

'మాస్టారూ... మీరిలా కూర్చోండి.' గెడ్డ ఒడ్డున ఓ చెట్టు కింద ఉన్న పెద్ద బండరాయిని చూపించాడు గంగన్న.

తర్వాత 'చిలకా, చిన్నయ్యా, మీరు చెలమ తీయండ్రా' అని పురమాయించి, గింజరిగాడితో కలిసి ముందుకెళ్లాడు. తుప్పల్లో వెతికి తాటిమట్ట తీసుకున్నాడు. అది రంపంలాగ ఉంది. దాంతో ఒక లేత తాటికొమ్మ కోశాడు. దాన్ని చేదలా మలిచాడు. అంతా నిమిషాల్లో అయిపోయింది.

రాయి మీద కూర్చొని, మాస్టారు రెప్ప వేయకుండా చూస్తున్నారు. చెలమ తీయటం పూర్తయింది. కాసేపట్లో చెలమనిండా నీళ్లూరాయి. అవీ బురదగానే ఉన్నాయి. ఈ నీటిని గంగన్న చేదతో చాలా ఒడుపుగా, వేగంగా బయట పారబోయటం మొదలెట్టాడు. కాసేపటికి చెలమ ఖాళీ అయింది.

మాస్టారికి గంగన్న అపురూపంగా కనిపించాడు. ప్రకృతి జ్ఞానాన్ని ఔపోసన పడుతున్నవాడిగా కనిపించాడు. కొత్తగా, ఆకాశమంత ఎత్తుగా, ఎన్నో తెలిసిన వ్యక్తిగా కనిపించాడు. మాస్టారి కళ్లలో ఆనందబాష్పాలు సుడులు తిరిగాయి.

ఆ క్షణాల్లోనే చెలమలోకి నీళ్లు చేరటం మొదలయింది. ఈసారి నీళ్లు బురదరంగులో లేవు. చాలా స్వచ్ఛంగా ఉన్నాయి. బురద రేణువులు ఇసుకపొరల్లో చిక్కుకుపోయి, నిర్మలమైన నీరు చెలమనిండా చేరింది. మాస్టారి మనసుకు అచ్చం అద్దంలా ఉంది చెలమ. చేదనిండా నీరు తీసి 'తాగండి మాస్టారూ' అన్నాడు గంగన్న.

దోసిలి పట్టారు మాస్టారు. చేదతో నీళ్లు పోస్తున్నాడు గంగన్న. మాస్టారి మామూలు దప్పిక తీరింది. జ్ఞానదాహం మొదలయింది. అది పుస్తకాల నుంచి, ఉపన్యాసాల నుంచి కాకుండా ప్రకృతి నుంచి, ప్రకృతి ఒడిలో పెరిగే పిల్లల నుంచి తెలుసుకునే జ్ఞానం.

దోసిలి బిగించి పట్టారు మాస్టారు.

నీళ్లు పోస్తూనే ఉన్నాడు గంగన్న.

ఒక్క చుక్క కూడా కింద పడిపోకుండా ఒడిసిపట్టుకొని, తాదాత్మ్యంతో తాగుతున్నారు మాస్టారు.

(ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక నవంబరు '04 సంచిక సౌజన్యంతో)



రచయిత మాట

పోటీకి రాయడం, బహుమతి పొందటం ఇదే మొదటిసారి. పన్నెండేళ్ళ క్రితం(1992) 'బాలభారతి'లో వచ్చిన 'ఓ తల్లి కథ' తొలి ప్రచురిత రచన. ఆ తర్వాత పిల్లలకోసం వందకు పైగా కథలూ, కబుర్లూ రాశాను. ప్రారంభంలో బాలభారతి, బాలజ్యోతి, బాలమిత్ర, చెకుముకి, మా బడి తదితర పత్రికల్లో ప్రచురితమయ్యాయి. తర్వాత అత్యధికం 'ప్రజాశక్తి'లో వచ్చాయి. 'తెలివైన తమాషాలు'(1995) పేరిట చిక్కులెక్కలతో ఓ పుస్తకం కూడా ప్రచురితమైంది. స్వస్థలం విశాఖజిల్లా నాతవరం సమీపంలోని ఆర్లోత్తూరు. జర్నలిజం అంటే చిన్నప్పటినుంచీ చాలా ఇష్టం. ఈ రంగంలో ప్రవేశించిందీ, ప్రస్తుతం పనిచేస్తున్నదీ 'ప్రజాశక్తి' విశాఖ ఎడిషన్లోనే. సమాజాన్ని అర్థం చేసుకోవటానికి నా దృష్టినీ, దృక్పథాన్నీ విస్తృతం చేసిన గొప్పదనం 'ప్రజాశక్తి'దే. కథలపై ఆసక్తి కలిగించింది మా అమ్మ. ఈ కథలోని గంగన్నలాంటి అబ్బాయి గురించి చెప్పినప్పుడు దాన్నొక కథగా రాయమని ఉత్సాహపరిచిన నా సహచరి శాంతికీ ఈ బహుమతిలో భాగం ఉంది.

గురజాడ, శ్రీశ్రీ నుంచి ఇప్పటి కొత్త రచయితల దాకా సమాజ అభ్యుదయాన్ని కోరే ఎవరి రచనలైనా ఇష్టమే. పుస్తక పఠనం హాబీ. 'బడి అవతల' కథలోని గంగన్నలాంటి వాళ్ళు గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది కనిపిస్తారు. ఈ కథకి బహుమతి వచ్చిందంటే అలాంటి పిల్లల ఆశలకు, ఆకాంక్షలకు మద్దతు లభించినట్టే! 'ఆంధ్రప్రదేశ్' పత్రికకు ధన్యవాదాలు.

–సత్యాజీ

అంపశయ్య నవీన్

కలలు నిజమౌతాయా ?

“ఈ మధ్య నాకు పీడకలలు మరీ ఎక్కువగా వస్తున్నాయండీ ! యేం చెయ్యమంటారు?!!

“పీడకలలంటే ఎలాంటి పీడకలలు? దయ్యాలా, భూతాలు కనిపిస్తున్నాయా ?!!

“దయ్యాలూ, భూతాలు కనిపించడం లేదండీ. నేనెవరి దగ్గరో పెద్ద మొత్తంలో అప్పు తీసుకున్నట్టుగా... ఆ అప్పు వెంటనే చెల్లించమని అతడు నా మీద పడుతున్నట్టుగా... నేనసలు నీ దగ్గర అప్పే చెయ్యలేదని అంటున్నట్టుగా... లేదు నువ్వు నా దగ్గర ఐదు లక్షలు అప్పు చేశావు... ఇవిగో పత్రాలు అని అతడు పత్రాలు చూపిస్తున్నట్టుగా... నామీద అతడు కోర్టులో దావా వేసినట్టుగా... కోర్టు వాళ్ళొచ్చి నా ఇల్లు జప్తు చేస్తున్నటుగా... ఇంట్లో ఉన్న వస్తువులన్నిటినీ వాకిట్లోకి విసిరేస్తున్నట్టుగా.... నా భార్యా, పిల్లలు నెత్తీ నోరూ బాదుకుంటున్నట్టుగా... నేను భయంతో, బాధతో, అవమానంతో కృంగిపోతూ బిగ్గరగా యేడుస్తున్నట్టుగా... ఆఁ ఆఁ అంటూ అరుస్తోంటే పక్కనే ఉన్న నాభార్య యేమండీ, యేమండీ, ఏమైందండీ ! అంటూ నన్ను నిద్రలేపుతోంది. ఇదంతా కలేనా ?!! అనుకుంటూ బోల్డు రిలీఫ్‌ను పొందుతాను. మరోసారేమో నేనెవర్నో హత్య చేసి పారిపోతున్నట్టుగా, పోలీసులు నన్ను వెంటాడుతున్నట్టుగా... చివరకు పోలీసులు నన్ను పట్టుకొని జైలులో పెట్టినట్టుగా ఇలాంటి కలలొస్తాయి. కలకంటున్నంతసేపూ అదంతా నిజమేననిపిస్తుంది. కల అని తెలిశాక ఎంత గొప్ప ఉపశమనాన్ని పొందుతానో. మాటల్లో చెప్పలేను... అసలు కలలెందుకొస్తాయంటారు? కలలో జరిగేవన్నీ నిజమౌతాయని కొందరంటారు. నిజమేనంటారా ?!!

“కలలెందుకొస్తాయని చాలా చిక్కు ప్రశ్నే అడిగావు... కలలకేమన్నా అర్థం ఉందా ? కలలో జరిగేవి నిజమౌతాయా ? అన్న ప్రశ్నలకు సమాధానాలు వెతకటానికి చాలామంది మేధావులు, రచయితలు, కవులు, మనస్తత్త్వ శాస్త్రజ్ఞులు క్రీస్తుకు పూర్వం నుంచీ ఇప్పటి వరకూ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

“సమాధానాల్ని కనుక్కోగలరా?”

“చాలా వరకు కనుక్కోగ్గల్గారు. కలలనేవి మానవుడి జీవితంలో చాలా భాగాన్ని ఆక్రమిస్తాయి. ఓ మనిషి నూరేళ్ళు జీవిస్తాడనుకుంటే దాంట్లో మూడొంతులు, అంటే సుమారు 33 సంవత్సరాలు నిద్రపోవడానికే సరిపోతాయి. ఈ నిద్రపోతున్న 33 సంవత్సరాల్లో ఓ 30 సంవత్సరాలున్న మనిషి రకరకాల కలలుకంటూ నిద్రపోతాడు. ఆ కలల్లో కొన్ని నువ్విప్పుడు చెప్పిన కలల్లాంటి పీడకలలుండొచ్చు. మంచి కలలుండొచ్చు. మొత్తం మీద కలలనేవి, మానవుడి జీవితంలోని అంతర్భాగాలే..!!

“అసలు కలలెందుకొస్తాయంటారు.. కలలనేవి కనకుండా మనం నిద్రపోలేమా ?”

“మనిషి మనసులోంచి కలలు పుడ్తాయి. మన మనసులో మనకు తెలియని అగాధాలూ, అధో లోకాలూ ఎన్నో ఉన్నాయి. కలల్ని మొదటిసారిగా శాస్త్రీయంగా విశ్లేషించిన సిగ్మండ్‌ఫ్రాయిడ్ అనే మనస్తత్త్వ శాస్త్ర వేత్త యేమన్నాడంటే మనిషి మనసులో మూడు అరలుంటాయని అందులో ఒకటి చేతన... లేక చైతన్యం. అంటే మనం మేలుకొని ఉన్న దశ. మనం మేలుకొని ఉన్నప్పుడు మనలో యేం జరుగుతున్నదో, మన చుట్టూ యేం జరుగుతున్నదో మనకు తెలుస్తుంటుంది.

మనసులోని రెండో అరను “ఉపచేతన” అంటారు. అంటే నిద్రపోతున్న దశ. మనం నిద్రపోతున్నప్పుడు మన మనసులో ఉన్న అనేక అంశాలు కలల రూపంలో వ్యక్తమౌతాయి. మనసులోని మూడో అరను ఫ్రాయిడ్ సుప్త చేతన అంటాడు. అంటే అక్కడేం జరుగుతున్నదో మనకు తెలీదు. సభ్య సమాజం అంగీకరించని మనలోని ఎన్నో కోరికల్ని మనం అణిచేసుకుంటాం. ఉదాహరణకు మనకు యే బ్యాంకునో దోచేసి లక్షాధికారులమైపోవాలన్న కోరిక ఉంటుందనుకోండి. - ఆ కోరికను మనం వెంటనే అణిచేసుకుంటాం. ఎందుకంటే ఆ కోరికను అమలు చేస్తే మనల్ని సమాజం అసహ్యించుకుంటుంది. పోలీసులు పట్టుకొని జైల్లో పెడ్తారు. అందువల్ల మనలోని ఈ దొంగతనం చెయ్యాలన్న కోరికను మనం అణిచేసుకుంటాం. మనలోని అణచివెయ్యబడిన ఇలాంటి కోరికలన్నీ మన సుప్తచైతన్యంలోకి త్రోసి వెయ్యబడ్తాయి. అయితే అణచివెయ్యబడిన ఈ కోరికలు యేదో రూపంలో వ్యక్తమవుతూనే ఉంటాయి. అవే కలలు. మనిషి బలవంతంగా అణిచేసుకున్న కోరికల్ని కలల రూపంలో తీర్చుకుంటాడనీ, కలలన్నీ మనిషిలోని తీరని కోరికల ప్రతిరూపాలేనన్నది స్థూలంగా ఫ్రాయిడ్ విశ్లేషణ. ఫ్రాయిడ్ తర్వాత ఇంకా అనేకమంది మనస్తత్త్వ శాస్త్ర వేత్తలు కలల్ని విశ్లేషించారు. ఫ్రాయిడ్ చెప్పిన ముఖ్య భావనతో ఏకీభవిస్తూనే కొన్ని విషయాల్లో అతనితో విభేదించారు. మొత్తం మీద అందరికీ తెల్సిందేమిటంటే కలలనేవి బయట్నించి రావు. యే దేవుడో, యే దయ్యమో వాటిని సృషించదు. అవి మనిషి మనస్సులోంచే ఉద్భవిస్తాయి. కలల్లో జరిగేవి నిజం అవుతాయనడానికి శాస్త్రీయమైన ఆధారాలేమీ లేవు. కలలో జరిగిందేదన్నా నిజమైందంటే అది యాదృచ్ఛికంగా జరిగిందని మాత్రమే అర్థం చేసుకోవాలి.

“మరి అలాంటప్పుడు కొందరు గొప్పోళ్ళు మా కలలు నిజమయ్యాయి-మా కలలు సాకారమయ్యాయి అంటుంటారేమిటి ?

కల అనే మాటను రెండు రకాలుగా వాడుతుంటారు - నిద్రపోతున్నప్పుడొచ్చే కల ఒక రకమైన కలైతే జాగ్రదావస్థలో మనం ఫలానా లక్ష్యాన్ని సాధించటం నా కల అనుకోవడం రెండో రకమైన కల. మనం సాధించదల్చుకున్న లక్ష్యాన్ని సాధించినప్పుడు నా కల నిజమైంది అనుకుంటాం. ఈ రకమైన కలల్ని నిజం చేసుకోవడానికి ఎంతో కృషి, పట్టుదల అవసరమౌతాయి. నిద్రపోతున్నప్పుడొచ్చే కలలు ఇందుకు పూర్తిగా భిన్నమైనవి. ఎక్కువగా తీర్చుకోవటానికి వీల్లేని, సభ్య సమాజం అంగీకరించని కోరికలే కలల రూపంలో వ్యక్తమవుతాయి. ఇలాంటి కలల చుట్టూ ఎన్నో మూఢనమ్మకాలు చేరాయి-వాటిని నమ్మకూడదు.

పి.ఎం.సుందరరావు



నల్లకుక్క తెల్లపాత్ర

ఒక అడవిలో నల్లకుక్క, తెల్లకుక్క వుండేవి. ఇవి పక్కపక్క ప్రదేశాల్లో నివశిస్తుండేవి. నల్లకుక్క మంచి బుద్ధిగలది. కష్టపడి ఆహారాన్ని తెచ్చుకొని, వండుకొని తింటూ బతికేది. తెల్లకుక్క మాత్రం ఏ కష్టం చేయకుండా, ఇతర జంతువులు వండుకున్న ఆహారాన్ని దొంగతనంగా తింటూ బలిసేది. అందువల్ల దానితో ఏ జంతువూ స్నేహం చేసేది కాదు.

తెల్లకుక్క ఓ రోజు నల్లకుక్క దగ్గరకి వచ్చి "మిత్రమా! నా కోసం కొందరు మిత్రులు వచ్చారు. వారికి విందు ఇవ్వాలి. నీ దగ్గర పెద్ద తెల్లపాత్ర వుంది కదా! అది ఇవ్వు. రేపు మళ్లీ నీకు తిరిగి ఇచ్చేస్తాను" అని అడిగింది. నల్లకుక్క సరేనని ఇచ్చింది.

మరుసటి రోజు కాదు, నాలుగు రోజులు గడిచినా తెల్లకుక్క ఆ పాత్రను తిరిగి ఇవ్వలేదు. నల్లకుక్క "నా పాత్ర ఇవ్వలేదేమిటి?" అని తెల్లకుక్కను అడిగింది. "భలేదానివే. ఆ పాత్రను నాకు అమ్మేశావు. దానిని నేను కొనుక్కున్నాను. తిరిగి ఎలా ఇస్తాను?" అని పోట్లాడింది తెల్లకుక్క. దాంతో నల్లకుక్క ఏం మాట్లాడలేక మౌనంగా వుండిపోయింది. అది తన పాత్రను ఎలాగైనా సొంతం చేసుకోవాలని అనుకుంటోందని దానికి అర్థమైంది. ఎలాగైనా తెల్లకుక్కలో మార్పు తీసుకురావాలనుకుంది.

కొన్నాళ్ళకు తెల్లపాత్రపై ఓ గుంటనక్క చూపు పడింది. ఓ రోజు తెల్లకుక్క దగ్గరకు వచ్చి "నిన్న నా దగ్గర తీసుకున్న తెల్లపాత్ర ఇవ్వలేదేంటి? ఇప్పుడు ఇవ్వు. కావాలి" అని అడిగింది.

నక్క తెల్లపాత్రను కాజేయటానికి ఇలా మాట్లాడుతుందని అర్థం చేసుకుంది. కానీ దాన్ని వదలకూడదనుకుని, ఆ అడవికి రాజు సింహం దగ్గరకు నక్కను తీసుకెళ్లింది. అక్కడ కూడా నక్క ఆ తెల్లపాత్ర తనదేనని వాదించసాగింది. సింహం అంతా విని తెల్లకుక్కతో "ఈ పాత్ర నీదేనని రుజువు ఏంటి?" అని అడిగింది.

"నల్లకుక్క దగ్గర కొన్నానని చెబితే దానిని పిలిపిస్తుంది. అది నిజం చెబితే నా పరువు పోతుంది. ఇప్పుడేం చేయాలి?" అని ఆలోచిస్తూ నీళ్ళు నమలసాగింది.

అక్కడ వున్న జంతువులు "ఈ పాత్ర ఈ రెండిటిదీ కాదు నల్లకుక్కది" అని చెప్పాయి.

వెంటనే సింహం నల్లకుక్కను పిలిపించి అడిగింది "గతంలో ఈ తెల్ల పాత్ర నాదే. కానీ... కొన్ని రోజుల క్రితం ఈ తెల్లకుక్కకు అమ్మేశాను" అని చెప్పింది నల్లకుక్క.

తెల్లకుక్క "హమ్మయ్య" అని ఊపిరి పీల్చుకుంది. సింహం ఆ మాటలు విని నక్కకు చీవాట్లు పెట్టి పంపించింది.

తెల్లకుక్క, నల్లకుక్క తమ నివాసాలకు చేరుకున్నాయి. అప్పుడు నల్లకుక్క మంచితనాన్ని, తన తప్పును తెలుసుకున్న తెల్లకుక్క "నన్ను క్షమించు మిత్రమా! నీవు నిజం చెబితే నక్కతో పాటు నాకు కూడా ఆ సింహం చీవాట్లు పెట్టేది. అడవిలోని జంతువులన్నిటి ముందు నా పరువు పోయేది. నీ పాత్రను కాజేసి నీకు అపకారం చేసినా అది మర్చిపోయి నాకు ఉపకారం చేశావు. నీ మంచితనానికి కృతజ్ఞతలు" అని ఆ తెల్లపాత్రను ఇచ్చేసింది. అప్పటి నుంచి తన బుద్ధి మార్చుకొని మంచిగా జీవించసాగింది తెల్లకుక్క. ఆనాటినుంచి అడవిలోని జంతువులన్నీ దానితో కూడా స్నేహం చెయ్యసాగాయి.



చిన్నారి చిత్రకారులు

ఎస్.కె. చాంద్‌బాషా, 8వ తరగతి, ఎస్ఎస్‌డబ్ల్యు హైస్కూల్, టంగుటూరు.



కె.ప్రవీణ్ కుమార్, 9వ తరగతి, రవితేజస్కూల్, మహబూబ్‌నగర్.

ఎస్.కె.వలి బాబు, 8వ తరగతి, గవర్నమెంట్ హైస్కూల్, టంగుటూరు.

స్నో మేన్ కావాలా!





నేస్తాలూ! ఈ వారం మీకు స్నోమేన్ తయారుచేయడం నేర్పుదామనుకుంటున్నాం. అదీ పేపర్ ప్లేట్లతో. సంతోషమేనా!

కావలసిన వస్తువులు: రెండు పేపర్ ప్లేట్లు, కత్తెర, గమ్, ఎరుపు, నలుపు కాగితాలు, ఎరుపు రిబ్బన్/ఊలు, క్రేయాన్లు, పెద్ద గుండీలు. **ఎలా చెయ్యాలంటే...** ఒక పేపర్ ప్లేటు తీసుకోండి. మధ్య భాగాన్ని మాత్రమే వుంచి చుట్టూ వున్న కాగితాన్ని కత్తిరించండి. ఇప్పుడు రెండు పేపర్ ప్లేట్ల అంచుల దగ్గర ఒక్కో రంధ్రం పెట్టండి. రెండు ప్లేట్లను (రంధ్రాలు వున్న వైపు) దగ్గరగా పెట్టి రిబ్బన్‌తోగాని, ఊలుతోగాని ముడివెయ్యండి. స్నోమేన్ శరీరం రెడీ అయినట్టే. తర్వాత నలుపు కాగితం తీసుకుని మెజీషియన్ టోపీ, రెండు బూట్లు గియ్యండి. ఎరుపు కాగితం తీసుకుని దాని మీద చేతులు గియ్యండి. తర్వాత వాటిని కత్తిరించుకోండి.



ఇప్పుడు వీటిని స్నోమేన్‌కి అతికించాలి. తర్వాత టోపీకింద కళ్లు, ముక్కు, నోరు గియ్యాలి. పొట్టమీద పెద్ద గుండీలు మూడు అతికించాలి. అంతే స్నోమేన్ రెడీ అయిపోయినట్టే. చివరికి టోపీ పైన ఒక చిన్న రంధ్రం పెట్టి కిటికీ దగ్గరో, తలుపు దగ్గరో, మీ గదిలోనో తగిలించండి. అదిరిపోద్ది.

వీరి వీరి గుమ్మడిపండు... వీరి పేరేమి?

ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో ఓ **పరుగులరాణి** వచ్చింది. ఆమె పేరేంటో ఈపాటికే మీకు తెలిసిపోయి వుంటుంది. మరి రాసి పంపుతారుగా. మా చిరునామా: **వీరి వీరి గుమ్మడిపండు**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాదు.

గతవారపు సమాధానం
చాచా నెహ్రూ

సరైన సమాధానాలు రాసిన వారు (పేరు పక్కన వున్న నెంబరు వారు చదువుతున్న తరగతి)

యుయు. బాబు నరేంద్రప్రసాద్ (7), జి.సునంద పవన్ (9), యు.భీమలింగ, యం.అనుదీప్, ఎమ్.అమ్రేష్, కె.విజయ్‌కుమార్, ఎమ్. తిమ్మప్ప, ఎమ్.బాలాజీ, బి.రవితేజయాదవ్, యు.ఈరన్న, ఎ.సుమంత, సి.నాగరత్న, బి.గౌతమి, కె.సులోచన, వి.నాగలక్ష్మి ఎమ్.మహేశ్వరి, ఇ.సునీత్, జి.ఈరమ్మ, ఎన్.భారతి, యు.రమ్యచంద్ర పి.విజయమాధవి, యు.దేవిసుధ, వి.మంజునాథ, డి.రిహానాభాను, యుఎస్.అనిల్, బి.శ్రీనివాసులు, ఎమ్.రమేష్ (9), శ్రీ వేణువిద్యాలయం, ఎమ్మిగనూరు.డి.శ్రీహరి (9), కుభీర్, ఆదిలాబాద్. పి.ముత్యం (8), న్యూలోలం, ఆదిలాబాద్. సుబియా రుబీన్ (6), విజయవాడ. కె.తులసి (5), కర్నూలు. ఎ.సంపత్‌కుమార్(7), నర్సాపురం. జి.రమేష్ (8). బిఆర్‌వి ప్రసాద్, డి. కృష్ణ (10), జి.కళ్యాణి, ఇ.సుజాత (8), టేకులపల్లి. బి.నాగు (8), సూర్యాపేట. సిహెచ్. గీతాకృష్ణ (7), జగన్నాథపురం. పి.రాజేష్ (9), పి.రత్నశ్రీ (8), ఈమని, గుంటూరు. బి.శకుంతల (7), సుంకరవీథి, వై.కళ్యాణి (7), విజయనగరం. జి.సాయిభరత్‌రెడ్డి (6), మోదుకూరు. ఎన్.జ్ఞానేశ్వరరావు (9), ఇంకొల్లు. వి.శ్వేత (6), నెల్లూరు. వి.సౌమ్య (5), వి.రాజావంశీధర్ (7), ఈమని. ఎన్.కోటేష్ (10), వెల్లినేడు, నల్లగొండ. సిహెచ్. చిత్రాంజని (5), జగన్నాథపురం.

ఏ రింగు తియ్యాలి?

ఇక్కడ మూడు రింగులు వున్నాయి కదా. వాటిలో ఒకదాన్ని తెరిస్తే మిగతా రెండూ బయటకు వస్తాయి. మరి ఏ రింగును తెరవాలో చెప్పండి.

వి'చిత్రం'

చిన్నారులూ! పైన ఓ బామ్మగారున్నారు. చూశారుగా. ఆమె ఓ పేద్ద బూటులో కూర్చుని విశ్రాంతి తీసుకుంటోంది. కాకపోతే తాతగారు కూడా అదే బొమ్మలో వున్నారు. ఎక్కడున్నారో కనుక్కోండి చూద్దాం. తెలీలేదా... అయితే పేజీ తిరగేసి చూడండి. బొమ్మకు ఎడమవైపు చెట్ల కొమ్మల్లో తాతగారు కనిపిస్తారు. అవునా!

వారిని కనుగొంటారా!

H	I	T	N	E	Y	A	D	E	L	B	U	O	D
O	R	I	O	N	E	L	E	S	T	E	R	R	A
W	M	Y	S	T	B	A	B	B	A	G	E	E	V
E	O	V	I	J	H	L	L	E	B	R	T	M	E
D	R	A	D	D	O	G	D	N	S	E	N	I	N
G	S	D	E	E	N	S	I	T	O	B	A	N	P
O	E	H	L	I	F	P	E	R	O	N	P	G	O
S	S	B	E	U	K	P	S	P	W	E	I	T	R
M	O	P	L	O	H	E	E	H	L	T	E	O	T
N	C	T	W	E	N	T	L	C	E	U	R	N	G
E	O	A	N	G	N	I	L	T	A	G	V	A	C
N	T	S	W	I	F	H	A	I	R	C	L	L	C
T	O	T	L	O	C	W	L	F	O	K	K	E	R
N	J	H	Z	F	R	A	N	K	L	I	N	N	Y
T	E	T	S	O	N	S	M	A	R	C	O	N	I

చిన్నారులూ! ఈ వారపు ఇంగ్లీషు పజిల్‌లో చాలా చాలా గొప్ప వారు చిక్కుకున్నారు. వారు ఎన్నో వస్తువులను, విషయాలను కనుగొన్నారు. కాకపోతే

ఇంగ్లీషు పజిల్-15

ఈ పజిల్‌లో వున్న వారిని మీరు కనుగొనాలి. అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా చూడండి. వారంతా ఇట్టే కనిపిస్తారు. ఓకేనా. మీ సమాధానాలను పంపాల్సిన చిరునామా: **ఇంగ్లీషు పజిల్**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాదు.

పజిల్ 13 కి సమాధానాలు రాసిన వారు

(పేరు పక్కన వున్న నెంబరు వారు గుర్తించిన పదాలు)

జి.కిషోర్(5), 6వ తరగతి, ఇంకొల్లు, ప్రకాశం. **టి.కృష్ణమూర్తి (6)**, **10**వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు. **కె.వంశీకృష్ణ(4)**, 8వ తరగతి, మహబూబ్‌నగర్. **బి.పద్మావతి (7)**, 6వ తరగతి, గుంటూరు.

ఇంగ్లీషు పజిల్-14 జవాబులు

Alternate	Powerline
Baseload	Regulated
Capacity	Retail
Condenser	Switch
Current	Transformer
Direct	Turbine
Electric	Utilities
Generator	Voltage
Grid	Wholesale
Magnetic	Peakload
Megawatt	

అప్పూకి రంగులు అద్దుదాం రండి!

నేస్తాలూ!

ఈ బుజ్జి ఏనుగు భలే ముద్దుగా వుంది కదూ. దీన్ని అడవిలో అందరూ అప్పూ అని పిలుస్తారు. దానికిగాని మీరు రహస్యంగా దాచిపెట్టిన రంగులు తీసి అద్దితే అదిరిపోద్ది. మరి ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా క్రేయాన్స్, స్కెచ్ పెన్నులు తీసి రంగులు నింపండి. అప్పుడు దాని దగ్గరున్న పూలగుత్తిని మీకు బహుమతిగా ఇచ్చేస్తుంది.

సరేనా!



వికసించిన మొగ్గ

తూర్పురేఖలు విచ్చుకోలేదు.

ఆకాశం మేఘాలదుప్పటి కప్పుకున్నట్లుగా ఉంది. వీధుల్లో దీపాలు కాంతులీనుతున్నాయి. వాతావరణం ప్రశాంతంగా ఉన్నా గాలి మాత్రం స్తంభించి పోయింది.

పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ

ఖమ్మం జిల్లా తల్లాడలో చిన్నవీధి. వీధి మధ్యలో కటకటాల ఇల్లు. ముందు గదిలో లైటు వెలుగుతోంది. కుర్చీలో కూర్చుని తరణి పుస్తకం చదువుతూ మధ్యమధ్య తలఎత్తి చూస్తోంది.

వీధిలోంచి సైకిలు చప్పుడు వినిపిస్తే లేచి నిలుచుని కటకటాల్లోంచి ఎదురువీధిలోకి చూస్తోంది.

నిరీక్షించడం విసుగ్గా ఉన్నప్పుడు పుస్తకం చదువుకుంటోంది. "రోజూ ఉదయాన్నే వచ్చే న్యూస్ పేపరు ఆ రోజు ఇంకా ఎందుకు రాలేదో" అని పదే పదే అనుకుంది తరణి.

ఆమె గత నాలుగు రోజులుగా ఈ రోజు ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసింది. ఎందుకంటే ఈ రోజు పదవతరగతి పరీక్షా ఫలితాలను ప్రకటిస్తారని రేడియోలో చెప్పారు.

తను ఏ క్లాసులో పాసవుతానా? అని తరణి ఆతృతపడుతోంది. పేపర్లో తన నంబరు చూసుకోవాలని ఆమెకు ఎంతో ఇదిగా ఉంది. అందుకే తెల్లవారక ముందే లేచి కూర్చుని పేపరు కోసం ఎదురు చూస్తోంది.

ఉదయాన్నే సైకిల్ గంట మోగించుకుంటూ పేపర్ బోయ్ రావడంతో తరణి గబగబా తలుపుతీసుకుని రోడ్డు బైటికివచ్చింది.

పేపరు వేసేటప్పుడు ఇంటి ముందు ఏరోజూ ఎవరూ కనిపించని పరిస్థితిలో తరణిని చూసి పేపర్‌బోయ్ ఆశ్చర్యపోయాడు. "ఏం పాపా! పేపరుకోసమా ఇంత ఉదయాన్నే నిల్చున్నావు?" అని ప్రశ్నిస్తూ అందించాడు. తర్వాత మళ్లీ – "ఈరోజు పేపర్లో టెన్తు రిజల్ట్సు వచ్చాయని కదూ?" అన్నాడు.

"అవును రిజల్ట్సు కోసమే ఎదురుచూస్తున్నాను!"

"మీ అన్నయ్య అప్పుడే టెన్తు పరీక్షలు రాశాడా?" అతనిలో విస్మయం.

"మా అన్నయ్య ఇంకా అయిదవ తరగతే చదువుతున్నాడు.. నా రిజల్ట్సు కోసమే పేపరు కోసం చూస్తున్నాను" అంటూ పేపర్ మడతలు విప్పింది.

"ఆరేళ్లమ్మాయి టెన్తు పరీక్ష రాయడమా?" అనుకుంటూ చిన్న గౌను వేసుకున్న తరణిని మార్చి మార్చి చూస్తూ సైకిలు ఎక్కి ముందుకు వెళ్లిపోయాడు.

తరణి పేపర్లో తన హాల్ టికెట్ నెంబర్ చూసుకుని ఆనందంతో చిందులు వేసింది. లోపలికి

పరుగున వెళ్లి అమ్మా, నాన్నలకు పరీక్ష రిజల్ట్సు వచ్చిన పేపరును చూపించింది. తన నెంబరు కింద పెన్నుతో అండర్‌లైన్ చేసింది. ఆరేళ్ల తరణికి ఏనుగు ఎక్కినంత ఆనందం కలిగింది.

* * *

ఖమ్మం జిల్లా తల్లాడ గ్రామానికి చెందిన పాడిబండ్ల ప్రేమ్‌చంద్ ఆయుర్వేద వైద్యులుగా ఉన్నారు. అతని భార్య దీపిక గృహిణి. 1991 జనవరి 3న కుమారుడు గోపిచంద్ జన్మించాడు. 1992 మే 2న తరణి జన్మించింది.

కూతురు పుట్టగానే సంతోషంతో పండగ చేసుకున్నారు. ఏడాది వయస్సు తేడా ఉన్నప్పుడు కూతురు, కొడుకులు ఇద్దర్నీ తల్లాడలో ఒకే పాఠశాలలో ఒకేసారి చేర్పించారు.

పువ్వుపుట్టగానే పరిమళించిందన్న విధంగా తరణి పాఠశాలలో చేరగానే తన ప్రతిభ చూపించింది. అయితే ఇతర పిల్లల నుంచి రకరకాల వేధింపులు రావడంతో పాఠశాలకు వెళ్లేది లేదని మారాం చేసేది. తల్లిదండ్రులు ఇద్దరూ కూతుర్ని బతిమాలి పాఠశాలకు పంపించే ఏర్పాట్లు చేశారు. అయినప్పటికి తాను ససేమిరా వెళ్లేదిలేదని తరణి భీష్మించేది. దీంతో అమ్మాయికి చదువు రాదని తల్లిదండ్రులు దాదాపు ఒక నిర్ణయానికి వచ్చేశారు. తరణి పాఠశాలకు ఎగనామం పెట్టి ఇంటిలోనే ఉండిపోయింది. తోటిపిల్లలందరూ చక్కగా పాఠశాలకు వెళుతున్న సమయంలో అసలు వెళ్ళకుండా ఇంట్లో కూర్చుని ఆటపాటలతో కాలం గడపడం ప్రేమ్‌చంద్‌కు ఎంతో బాధ కలిగించేది. తల్లి దీపిక కూతుర్ని పాఠశాలకు పంపించాలని ఎంతగానో ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది.

ఆ సమయంలో ప్రేమ్‌చంద్ గ్రూప్ వన్ పరీక్షలు రాయాలని నిశ్చయించుకున్నాడు. అంతవరకూ తాను ప్రయివేటుగా ఆయుర్వేద వైద్యం చేస్తున్నందున ఉద్యోగం కోసం ప్రయత్నిస్తే మంచిదని సర్వీసు కమిషన్ పరీక్షలకు హాజరవ్వడానికి నిర్ణయించుకున్నాడు. ఇందుకు సంబంధించి జనరల్ నాలెడ్జి పుస్తకాలను తెప్పించాడు. పరీక్షల్లో ఎలాగైనా ఉత్తీర్ణత సాధించాలన్న పట్టుదలతో రాత్రి పగలూ వాటిని చదవడం మొదలుపెట్టాడు.

అతని ప్రయత్నం తరణిని ఆకట్టుకుంది.

తండ్రి చదువుతుంటే ఆసక్తిగా గమనించేది.

అంతవరకూ పాఠశాలకు వెళ్ళకపోయినా ఇంటివద్దనే ప్రయివేటుగా తల్లిదండ్రులు రాయడం, చదవడం నేర్పించడం ఆమెకు ఉపయోగపడింది.

తండ్రి చదువుతున్న పుస్తకాలను జాగ్రత్తగా గమనించేది. రాత్రి ఇంట్లో అందరూ పడుకున్న సమయంలో కూడా లైటు వేసుకుని ఒంటరిగా పుస్తకాలను చదవడం అందులో ముఖ్యమైన అంశాలను చిన్న నోటు పుస్తకంలో నమోదు చేసుకోవడం చూసి ఎంతో సరదా పడేది. క్రమంగా చదువుపట్ల ఆమెలో కూడా ఆసక్తి పెరిగిపోయింది.

ముందు చిన్న బొమ్మల పుస్తకాలు చదివేది.

తర్వాత న్యూస్ పేపరు చదవడం మొదలుపెట్టింది. క్రమంగా చదవాలన్న ఇష్టం తరణిలో విపరీతంగా పెరిగిపోయింది. పాఠ్యపుస్తకాలను తిరగవేసేది. అన్నయ్య గోపీచంద్ చదివే పుస్తకాలన్నింటినీ బట్టీ పట్టింది.

కూతురు ఆసక్తి గమనించి ప్రేమ్‌చంద్ ఆమెను మరింత ప్రోత్సహించాడు. కేవలం ఆమెకు ఆరు సంవత్సరాల వయసు మాత్రం ఉండగా ఆమె నాలుగైదు తరగతుల పుస్తకాలు చదవడం అందులో ప్రశ్న జవాబులను అప్పగించడం చేసేది.

దీంతో ప్రేమ్ చంద్ తల్లాడ పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులతో సంప్రదించి ఆరేళ్ల వయసులో మూడవ తరగతి పరీక్ష రాయించాడు. అందులో ఆమె పాఠశాలలో అందరు విద్యార్థులకన్నా మంచి మార్కులు సంపాదించి ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలైంది.

ఆ తర్వాత తరణి వెనక్కి తిరిగి చూడలేదు.

* * *

తరణి ప్రయివేటుగా అన్ని సబ్జెక్టులు నేర్చుకుని అందరిలోనూ విలక్షణంగా నిలిచింది. ఏ విషయమైనా తెలుసుకోవాలని, నేర్చుకోవాలని ఆమెకు ఎంతో ఇష్టంగా ఉండటం బాగా చదవడానికి ఉపయోగపడింది.

ఏడేళ్ల వయస్సులో 10వ తరగతి పరీక్ష రాయడానికి ఏర్పాట్లు చేశారు. ప్రేమ్‌చంద్ అప్లికేషన్ నింపి అందించారు. అయితే పదవ తరగతి పరీక్ష రాయాలంటే కనీసం పదిహేను సంవత్సరాల వయస్సు ఉండాలి. కాని తరణి దరఖాస్తు చేసే సమయంలో ఏడేళ్ల ఎనిమిది నెలలు మాత్రమే ఉండటంతో విద్యాశాఖాధికారులు దరఖాస్తును తిరస్కరించారు.

ప్రేమ్‌చంద్ ఈ విషయాన్ని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకురాగా ఆయన ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అప్పటి రాష్ట్ర

(మిగతా 17వ పేజీ)

త్రినేత్రి

ఇంట్లోనూ పొరమంటే ఎట్లా...

వాడెంతగా అరిస్తే మాత్రం దీపం వెలిగించకుండా వుండి చచ్చేదెలానో తెలిచ్చావడం లేదు మరి.

అందులోనూ ఈ కార్తీకమాసం రోజుల్లో దీపారాధన లేకుండానా...వీడు మరీ అడ్డగోలుగా మాట్లాడుతున్నట్లుంది. వీడు పనిచేసేచోట అవేవో యూనియన్లంటూ... వాటి మీటింగులకు వెళ్ళతాడు... వాళ్ళు చెప్పినవన్నీ తలకెక్కించుకొచ్చింది కాక... హమ్మా...ఈ ఒత్తులు చేయడవేంటీ...ఇంటి ముందంతా ఆ దీపాలెట్టడం ఏంటీ... అందులో అంతంత నూనె పోయడం ఏవిటని నన్ను నిలదీస్తాడా?!

ఒక వేళ కోడలుపిల్ల నేర్పి పెడుతోందని అనడానికా ఆ పిల్లకలాంటి బుద్ధుల్లేవమ్మా... ఏమాటకామాట చెప్పుకోవాలి... నాకు మాత్రం మంచి కోడలు పిల్ల దొరికింది.

వీడెప్పుడన్నా కోపంగా మాట్లాడ్తాడా...ఈ కోడలుపిల్ల అదేవిటండీ ఇంటికి పెద్దావిణ్ణి అలా అంటారు... తప్పు కదా అంటుంది. మీరేవన్నా చెప్పదలుచుకుంటే అలానా... ఆవిడకర్ధమయ్యేలా చెప్పొచ్చుకదా అని వాణ్ణి కొంచెం నిలబెడుతుంది. మీరు కాలేజీలో అందరికీ అర్థమయ్యేలా విడమర్చి చెబుతారు కదా... ఆ ఓపిక ఇంట్లో వాళ్ళ పట్ల చూపరేం అని కూడా అంటుంది. మనిద్దరం ఉద్యోగరీత్యా చెరొకవైపుకీ పోతే...ఆవిడే కదా మనకీ మన పిల్లలకు వండీ వార్చీ ఇల్లు సర్ది చాకిరీ చేస్తోంది...ఆవిడే లేకపోతే నాకింకా ఎంత భారం. నాకు మా అమ్మలా అన్నీ చూసుకుంటున్న అత్తగార్ని వూరికే మాటలంటే ఊరుకునేది లేదు అంటూ కోడలుపిల్ల మా వాడి మాటల ధాటికి భలే కళ్ళెం వేస్తుంది.

అదికాదు భార్యామణీ...మా అమ్మకే కాదు ఒక్కోసారి నీక్కూడా చెప్పేదేవిటంటే... అంటూ వాడు చెప్పేదాంట్లోనూ కారణం లేకపోలేదు. వాడు అనేదాంట్లో ఇలా అయితే ముందుముందు ఎట్టా అనే ముందు చూపున్నమాటా వాస్తవమే.

మరి నేనేం చేసేది చెప్పండి. ఇంటి ముందు దీపారాధన చేసుకోవడం తరతరాలుగా వస్తున్నదే...అందులోనూ కార్తీకమాస దీపారాధన ఇంకెంత మంచిదో మా పెద్దోళ్ళు నాకు నూరిపోశారు. మరి ఆ రోజుల్లో ఇలా రోజుకెన్ని గంటలో అన్ని సార్లు నూనె ధరలు పెరగడమనే మాట లేదుకదా. ఆ రోజుల్లో ఇలా దీపారాధనకంటూ నువ్వులనూనె కేజీలక్కేజీలు ప్రమిదెల్లో పోసేవాళ్ళం. ఇప్పుడూ అలా చేయబోతే ఆచారం మాట దేవుడెరుగు...అలా నూనె ప్రమిదల్లోని ఒత్తులద్వారా ఆవిరైపోవడం చూసి ఇంటిపోషణ చూసేవాళ్ళకు కోపం రాదా ఏవిటి?

కోడలుపిల్లా సంపాయిస్తోంది. నెలనెలా పెరుగుతున్న ధరలు ఇంటివాడకంపై బరువుపడుతున్నా మా వాడిలా అనలేక అంటల్లేదేమో గానీ... ఆ పిల్లకూ మనసులో ఉండే వుంటుంది. ఏం చేస్తుందీ పాపం...దానికి వరుసగా ముగ్గురూ ఆడపిల్లలేనాయే...ఆ ఆడపిల్లల్ని ఒకదారిచేయడానికి డబ్బుల్ని జాగ్రత్తచేయకపోతే ఎట్లా అని ఉండే వుంటుంది. కానీ పాపమా కోడలుపిల్ల పైకి నన్నొక్కమాట అనదు...వాణ్ణి నన్ననినీయదు. నా ముగ్గురు మనవరాళ్ళనూ నేను అల్లారుముద్దు చేస్తాను కదా... అందుకనేమో మరి!

ఉదయం పూట వీలుకాకపోయినా సాయంత్రం తిరిగొచ్చాక కోడలుపిల్ల ఇక నా చేతికిందే ఉంటుందిలేండి. ఇకప్పుడు మేం మాట్టాడుకోడం వింటాడు గావాల్న. అత్తా కోడళ్ళు తల్లీకూతుళ్ళయితే నీకు కోడలి పోరు లేదు కదా అమ్మా అంటాడు. అందుకని అల్లుడు పోరులా నేను పోరుతాలేవే అంటాడు.

మా కోడలు ఈ కాలవు పిల్లకాదు...రాబోయే కాలప్పిల్ల. అందుకే మా వాడూ సాయంకాలాల వంటపనుల్లో సాయం రాబోతాడా...నేను ఓరి మొగవెధవ పోరా... ఆడంగులం వేం లేమా అనంటాను. అదేంటత్తయ్యా...ఈరోజుల్లో అందరూ సమానమే. అన్ని పనులూ సమానమే... ఆడపని, మగపని తేడాలేవీ ఉండవు అంటుంది. అది నాకైతే పూర్తిగా అర్థంకాదుగానీ...అలా కలగలిసి ఉండటం కొంచెం ముచ్చటగానే అనిపించింది.

వాడూ ఒత్తులు చేసి పెడతానంటూ కూర్చున్నాడు. వాడితో పాటు వాడి ముగ్గురు కూతుళ్ళూ తయారయ్యారు నానమ్మా..నానమ్మా అంటూ. వంటింటి పనెట్టాగూ అయిపోయింది కదా అందరం ఆ టీవీ ముందు కూర్చొని ఆ ఒత్తులు చేద్దామంటూ తెలివిగా అందర్నీ అక్కడికి చేర్చింది కోడలుపిల్ల.

ఒత్తులు చేస్తూ టీవీ చూద్దామంది.

టీవీ పెట్టి ఆ పాటలూ ఈ పాటలూ పెట్టిందా...కాస్సేపటికి...అందరం చూసేటట్టు వార్తలూ విశేషాలు పెట్టింది.

అందులో వార్తలు వింటుంటే... కాదుకాదు చూస్తుంటే... పెరుగుతున్న ధరలు వాటి విరగబాటు చూస్తుంటే... పండగలే కాదు మామూలు రోజులు కూడా ఎట్టారా నాయనా అనిపిస్తోంది. మంచినూనె రేటు పెరిగి మోపెడయ్యిందిరా నాయనా అనుకుంటుండగానే...

అదేదో ఊళ్ళో గ్యాసుబండకూ, గ్యాసుపొయ్యికీ పూజ చేస్తున్న దృశ్యం వార్తల్లో చూపించారు. అదేవిట్రా పూజలంటే ఏ దేవుడికో దేవతకో అనుకున్నా. ఇప్పటికీ పూజలూ పునస్కారాలే చేయలేక ఛస్తుంటే ఇలా పొయ్యిలకూ, గ్యాసుబండలక్కూడా పూజలు చెయ్యాలంటే ఇక మా కెక్కడ కుదుర్తుందీ...అదీ రోడ్లమీదా... అవ్వ అన్నాను.

రోడ్డు కాదు నానమ్మా...కలెక్టరాఫీసు ముందని చెప్పడంలా ఆ వార్తల్లో... అంది నా పెద్ద మనవరాలు.

ఇదేవిటే మరీ విడ్డూరం... ఆఫీసులముందు వంటలేవిటీ...వాటికి పూజలేవిటీ అనంటే అప్పుడందుకుంది మా కోడలుపిల్ల.

మంచినూనె, పప్పులూ, ఉప్పులే ధరలు పెరిగి బాధపడుతుంటే మళ్ళీ గ్యాసుధర, పెట్రోలు ధర పెంచారనీ ఆడామగా, కూలీనాలీ జనం అలా గోల చేస్తున్నారని చెప్పింది. ఆ తతిమా వార్తా విశేషం వింటేముందీ.. ఆ కాస్త విషయాలు నేనే నా చెవులారా విన్నాను.

ఓరి వీడి జిమ్మడిపోనూ...గ్యాసుకి ఇప్పుడు పెంచడవే కాదుట...నెలనెలా ఐదేసి రూపాయలు పెంచుకుంటూ పోతాట్ట. అలానే పెంచుకుంటూపోతే జనమెట్టా బతికేట్టు? కొడుకూ కోడలు ఇద్దరూ పనిచేసుకొచ్చినా ఇంటి ఖర్చుల గురించి, పెరగబోతున్న ధరలమోత గురించి ఇంత ఆలోచిస్తున్నాం. పాపం మామూలు జనం... మొగాడొక్కడే బయటికెళ్ళి సంపాయించాలి... ఆడదింట్లోనే పడివుండి నా లాగా వండివార్చాలి అనుకునే ఇళ్ళల్లోని ఒంటి సంపాదనపరులెలా బతుకుతారు. ఇంక ఆ కూలీనాలీ జనమెట్లా బతుకుతారు?

అప్పుడప్పుడు మా వాడెల్లి వచ్చిన ఆ యూనియన్ మీటింగుల్లో విన్నవాటిని కోడలికి చెప్తుంటాడు. ఆ మాటల్లోని అర్థం నాకీ రూపంగా అర్థమవ్వాలనేమో మా కోడలు అందర్నీలా వార్తలముందు కూర్చోబెట్టిందనుకున్నాను.

ఇక చాల్లేరా...చేసిన ఒత్తులకే నూనె ఎక్కణ్ణించి తేవాలి? అయినా ఒకటో రెండో దీపాలెలిగిస్తే చాల్లే. దీపావళి కూడా అయిపోయి రెండురోజులయ్యింది కదా...ఇదుగో అమ్మాయిలూ...ఎంచక్కా అందరం చన్నీళ్ళ స్నానాలు చేయాలి. గ్యాసు ధర పెరిగింది. నెలనెలా పెరుగుతుందిట. వేన్నీళ్ళు కాచడం కుదరదు.

ఇక మా వాడికి ఇంటోనూ పొరం చెప్పాల్సిన పని పెట్టకూడదని అనుకున్నా. అయినా నా పిచ్చిగానీ వేణ్ణీలకు బదులు చన్నీళ్ళు పోసుకున్నంత మాత్రానా ధరలు తగ్గుతాయా? దీపారాధనలు తగ్గించుకున్నంత మాత్రాన నూనె ధర దిగొస్తుందా? ఈ పెరిగే ధరలకు కళ్ళెం వేయడానికేదో ఉపాయం ఉండివుంటుంది. ఈసారి మావాడు మీటింగుకెళ్ళొచ్చి చెప్పే మాటలినాలి.

“అగ్గగో...అవినీతినంతం జేత్తంద్రు”

కాలువ మల్లయ్య

“ఓ నువ్వద్ది రాజమల్లన్నా...ఇట్రా లేవె...?” అని గొల్లకేక వెట్టి పిలువబట్టిందు లక్ష్మారెడ్డి.

అక్కడ బాగ మందే ఉన్నరు.

దవ్వ దవ్వ నడ్చుకుంటచ్చి గాల్ల దగ్గెర నిల్సున్నడు రాజమల్లు..."ఏందేమొ కేకేసి పిల్వబడ్తివి" నవ్వుకుంటన్నడు.

"గిక్కడ మస్తు మాటలు జరుగుతన్నయి. నువ్వంటె మంచిగుంటదని పిల్సిన...ఏందేమొ బాగేగిర్త పడవడ్తివి...!"

"ఏగిర్తవేంంలేదు గని గీ ముచ్చెట్లెప్పటికున్నయేనాయె... ఉనుక ఊడ్సినా పాయె...తవుడు దాల్చినా పాయెనన్నట్టు గివ్వి దేనికన్న పనికచ్చేటియా?"

"అయెహ్యా రాజమల్లన్న...నువ్వే గిట్లంటేవన్నట్టు...? మాట్లాడ్తాంటె మాట్లాడ్తాంటే గదే మందిల గలుత్తది...గిది నువ్వే సెప్పితివి..."

"గా మాట నిజమే కని దేన్ని గురించి ఈ ఒర్రుడంత..."

"ఇగో గీ మాటిన్నరా మీరు...?" అన్నడు లక్ష్మారెడ్డి

"గదేందో సెప్పనేలేదు...గీ మాటిన్నరా అంటేందన్నట్టు...ఏదో శాత్రం జెప్పినట్టుంది.."

"అరె నీ కందులు గాల సెప్పేరాకనన్నాగుతవా లేదాయె. ఈరమల్లు... పురాగ సెప్పనియ్యకముందే ఎగవడవడ్తిరేంది... ఇయ్యాల్లంతెట్లనో కనవడ్తంది మరి."

"ఐతేమానాయెగని గా సంగతేందో సెప్పు...?"

"గదే... మొన్న మన పెద్దసారు మంత్రన్నడు విన్నరా...? గదే సంగతి...గయినే మన రాష్ట్రంల నుంచే అవినీతిని పురాగ తరిమిపారేత్తడట...గీ మాట వింటె గమ్మత్తనిపిత్తలేదా...?"

లక్ష్మారెడ్డి మాటలకందరు పక్కడపక్కడ నవ్వవట్టింద్రు..."గింద్లేముందని గట్ల నవ్వుతంద్రు...?"

"ఎందుకులేదు...? గిది గీ శతాబ్ది జోకనుకోవచ్చు..."

"గంతేకాదు...గిది పెద్ద గ్లోబల్ జోకనుకున్నా తక్కువే... ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికెక్కిందట...ఇల్లు సక్కవెట్టుకోవాలె గని గిట్ల మాట్లాడ్తేమత్తది...? గీ రాజకీయాలే పెద్దజోకయితె గాల్లు మాట్లాడేటియి జోకులు గావా...? పెద్దోల్లు మంచిగుంటె చిన్నోల్లు మంచి గుంటరు...యథా రాజా తథా ప్రజని వట్టిగనే అన్నరా...?"

"ఏందీరమల్లు గట్లనవడ్తివి...?"

"గదంతేమరి... నాకు తెల్సినయినే ఓ డి.ఇ.ఓ. ఉండెటోడు...గయినె మా దండి నీతిమంతుడు...ఎంత నీతిమంతుడంటె బల్లల్లకు తనిఖీకని పోతరు గద...గప్పుడు నీల్లు, అన్నం కూడ ఎంబడి



తీసుకపోయెటోడు...వాళ్ళేం బెట్టినా, ఇచ్చినా తీసుకునెటోడు గాదు. గసోంటి మనిషి గూడ గీ కాలంలుంటడా అంటె ఉన్నడుగద మరి...! జీతం రాల్లతోనే బతికెటోడయినె...గవ్వీట్నే వెనుకేసుకుని ఇల్లు కట్టుకున్నడు. గయినె కాలంల సార్ల నౌకర్లకు రాత పరీక్షలయినయి. ఇగరొంద్రోజులల్ల ఎవ్వలకు నౌకర్లచ్చినయో బైటికత్తది...

ఇలా ఫోన్లమీద ఫోన్లు మోగవట్టినయి. ఎవ్వలితోని మాట్లాడ్తేం తిప్పలో...? ఎవ్వలు ఫోన్ చేసినా "లేదు లేదు లేదు..." గిదే జెవాబు.

ఎన్ని సార్లు ఫోన్లు చేసినా గంతే...

రాత్రి రొండు గంటల దాక పనిజేసింద్రంత...అక్కడికే అన్ని తెప్పిచ్చిందు...మార్కుల ప్రకారం లిస్టు తయారుజేసిండు. తెల్లారంగ గోడకంటేయించిండు...లిస్టు పత్రికలోల్లకిచ్చిండు...

సెలవు పెట్టి చెంగో బిల్లన్నడు...

తెల్లారెవారకు వార్త గుప్పుమని బయటకచ్చింది...లీడర్లు చెప్పిన ఒక్క మనిషి గ్గూడ నౌకరీ రాలేదు. అటెనుక నాయకులంతచ్చింద్రు...మండిపడ్డరు. ఎగిరెగిరి గంతులేసింద్రు...గప్పుడేం చెయ్యలేదు కని హైదరాబాద్‌కు పెయినంక చేసేది చేసింద్రు...ఇగ గా పనెట్లయిన ఐపోయింది గద...! గయినను మారుమూల పల్లెకు తబాదలా చేసింద్రు... దేనికనుకున్నరు... డి.యి.ఓ. నుంచి హెడ్మాస్టరుగ...అయినా గయినేం భయపల్లేదు...పోయక్కడ సేరిండు...గట్లెంత మందుంటరో సెప్పుంద్రి...గిదీ రాజకీయ నాయకులు జేసేది... ముడుపుల పద్ధతి, పైరవీల పద్ధతి పోతే గీ అవినీతి కొంతైనా తగ్గుతది..." అన్నడు ఈరమల్లు.

"అవుమరి...మన రాజకీయ నాయకులంటేనే అవద్దాల పుట్టలని అరుతం... ఎప్పుడన్నా వాళ్ళు నిజాలు చెప్పింద్రా...? ఇగో గిది నిజంగా జరిగిన సంగతి. ఓ నాయకుడు నీతీనిజాయితీల గురించి మాట్లాడ్తున్నడు...జోరుగ మాట్లాడ్తండు..ఒగాయినె లేసి నిల్సున్నడు...సారూ...! మీరు రాజకీయాలల్లకు వచ్చి ఆరేడేండ్లే అయింది...రాజకీయాలకు రాకముందు మీ ఆస్తి ఐదెకురాలు...గిప్పుడేవెా అరవై ఎకురాలంటంద్రు...గిదెంతెట్ల సంపాయించింద్రు మీరు...మల్ల నీతి గురించి మాట్లాడవడ్తిరి అని...గా మాటలకు గా నాయకుడేమన్నడో ఎరికేనా...? నా ఆస్తిప్పుడు అరవై ఎకరాలుకాదు. డెబ్బై...గీ లెక్కలు గూడ సరిగ్గ రావు నీకు...అవుమరి...నేను గిదంత అవినీతితోనే సంపాయించిన...మరి గా పైసల్నిచ్చినోల్లెవ్వలు...? మీరేగద..! నాకు గా పనిచెయ్యి గింతిత్త...నాకు గా కంట్రాక్టిప్పిత్తే గింతిత్త...నా తాబదలా అయితే గింతిత్తా అని మీరే తెచ్చిత్తిరి...మీరిత్తే నేం దీసుకునేది. మరి మీరంత అవినీతిపరులు గారా...? మీరియ్యంది మేమెట్ల తీసుకుంటం...? నోర్మూసుకొనూకో...అన్నమోలే ఊకున్నడయినె..

గిది జెనం చెవులల్ల పువ్వులు పెట్టుటానికేననుకోంద్రి. కిందటి వారం ఏం జేసింద్రు. అవినీతి ఎతిరేకవారం అని ఎంచక్కా పతీ ఆఫీసు ముంగటా బేనర్లు గట్టింద్రు. గంతేకదా.... గీ అవినీతి నిర్మూలనెట్టుందంటె ఫొటోలల్ల పడెటట్టుంది. ఓ చెపరాశినో, చిన్న నౌకరీగాన్నో పడుతరు. ఇగ సంపుకతింటరు...వార్తలమీద వార్తలు...కోట్లు తినెటోని జోలికేమొ పోరు. అంటె లక్షలు, కోట్లు తింటేనేమొ గది నీతయితది...నూర్లు వెయ్యిలు తింటెనేమొ అవినీతయితది...గిట్లుంది సంగతి. ఎమసదార్ల బాకీలయితె ముక్కులు పిండి వసూలు జేత్తరు. గదే లక్షల బాకీలనయితె ఊకుంటరు...ఫైనాన్సులు, బేంకులు ముంచుతంటె ఎవ్వలనన్న పట్టుకున్నరా...? మరిగ అవినీతిని అంతం జేసేదెక్కడ...? గాల్లందరికి అండదండగుండేది రాజకీయులే నంటరు..." అన్నడు లక్ష్మారెడ్డి.

"గీల్లెట్ల అవినీతి నిర్మూలనజేత్తరో సెప్పుంద్రి...గా నాయకుడు మన పార్టీవాడయితె

కోట్లుదిన్నా మంచిదే... మిత్రపక్షం వాడయినా గంతే... ఎదుటి పార్టీవాడయితె కోట్లుదిన్నా మంచిదే... మిత్రపక్షం వాడయినా గంతె... ఎదుటి పార్టీవాడయితె గప్పుడు బైటవెడుతరు... మల్ల గయినే మనలను ఒప్పుకుంటె గవ్వన్ని మాఫీ.. అందరి విషయంల గిట్లనే జరుగవట్టె.. ఇగ నడుమ మూర్ఖులయ్యేదెవలు...? ప్రజలే కద... కొందరికేమొ బోఫోర్స్ పెద్ద కుంభకోణమయితె ఇంకొందరికి తెహెల్కా... నిజానికి దొందూదొందే అన్నట్టు అందరందరే... మల్ల అన్నీట్ని రాజకీయాల కోసరం వాడుకునుడు తప్పుతె ఎవ్వలకేంగాదు... న్యాయవ్యవస్థను గూడ కొనెదాకచ్చింది. రాజస్థాన్‌ల బెస్టు బేకరీ కేసు నేం జేస్తుండ్రు. గా పోరి జహీరా జరంత ధైర్యం జేసింది. సాక్ష్యమిస్తానంది. గా పిల్లను ఏం బెదిరించిండ్రో, డబ్బిస్తామని కొనేసిండ్రో గిప్పుడే సప్పుడు సేయనంటంది. రాజకీయుల అవినీతి... గింద్ల కొంచెం ఎక్కో తక్కో అన్నట్టే కని ఎవ్వలేం తక్కో ఉన్నరు..."

"గిట్ల అన్నీట్ని సాధారణీకరించుడు మంచిది గాదీరమల్లూ...! గప్పుడెప్పుడో ఇందిరాగాంధి అవినీతి సర్వవ్యాప్తం అన్నట్టే ఉన్నయి గీ మాటలు... గప్పుడు అవినీతి కొంచెమంతున్నప్పుడే గట్లంటె ఇగ గిప్పటి సంగతేంది..? గీ రాజకీయపోల్లకు నీతులేడేడ్చినయి..."

"చెప్పినగద కొంచెం ఎక్కొ తక్కో అంతేనని...! అయితె పురాగ సంపాదన కోసురమే నాయకత్వం, రాజకీయాలనుకునెటోల్లు కొందరున్నరు. సంపాదన రాజకీయాల్లో ఓ భాగం అనుకునేటోల్లు ఇంకొందరున్నరు... అయితె పార్టేదయినా చాలా తక్కువమందే కావచ్చు కని నీతిగా, నిజాయితీగా బతికెటోల్లున్నరు... కాని అసొంటోల్లు గీ కాలంల చాతగాని నాయకులుగ పేరుదెచ్చుకున్నరు... అయితే గసొంటోల్లే తృప్తిగ బతుకుతరు... తలెత్తుకొని బతుకుతరు..."

"మరి గీ రాజకీయ అవినీతి ఇంతింతై అన్నట్టు పెరుగవట్టె... గీల్లకు శిక్షలనిరి... ఇంకేదో అనిరి... కని గదంత ఉత్తదేనాయె. మరి గీల్లనేంజేత్తె బాగుంటదే రాజమల్లన్న...?" అన్నడు లక్ష్మారెడ్డి.

ఒక్కసారి దగ్గి సరాయించి చెప్పవట్టిండు రాజమల్లు.

"ఇగో... గప్పుడెప్పుడో పేదరికాన్ని నిర్మూలించుతమన్న మాటవిన్నం... గాల్లేం జేసిండ్రు...? పేదోల్లను నిర్మూలించిండ్రనన్నరు. గిప్పుడు గా మాటనుదెట్టుంటదంటె బిల్‌గేట్స్ వచ్చినప్పుడు బిచ్చగాల్లను కనపడకుండ తరుముకపోయినట్టుంటది. గిప్పుడు రాజకీయ అవినీతి సంపాదన హైటెక్కు లెవల్ల పెరిగింది... గప్పుడు రాజులు వందలేండ్లు పరిపాలన జేసినా సంపాయించుకోనంత డబ్బు గిప్పుడు మన మంత్రులు ఐదు, పదేండ్ల మంత్రి పదవులు జేసి సంపాయించుకుంటండ్రు. గాల్లనేమనత్తది సెప్పు...? బ్రోకర్లను పెంచి పోషించె సమాజంల గిట్లనే ఉంటది మరి...

గీ అవినీతి సొమ్మును రావట్టన్నంటె మా రావట్టచ్చు... గీ కమీషన్లు... ఎంక్వయిరీలతోనేం గాదు. మనకు సతంత్రం వచ్చిన కాన్నుంచి లెక్క... గప్పుడు దేశంలున్న ప్రతి కుటుంబం ఆస్తులు లెక్కవెట్టాలె... ఇన్నొద్దుల నుంచి వాళ్ళు చేసిన పనులు, సంపాదన లెక్కవెట్టాలె. గింద్ల రాజకీయ నాయకుల్ని గూడ కలుపాలె. గాల్లకెంతాస్తుంటదో ఉంచి మిగతాది గవర్నమెంటు తీసుకోవాలె... గట్లచ్చిన డబ్బుతోని మనం ప్రపంచ బ్యాంకుకే అప్పియ్యచ్చు. ఎవ్వలకేం శిక్షద్దు... చెయ్యవల్సింది గింతే..." అన్నడు రాజమల్లు.

వికసించిన మొగ్గ

(14వ పేజీ తరువాయి)

గవర్నర్ రంగరాజన్ పదవ తరగతి పరీక్షలు రాయడానికి ప్రత్యేకంగా అనుమతిని మంజూరు చేశారు.

2000 మార్చిలో పరీక్షలు జరిగాయి.

ఎనిమిదేళ్లు కూడా నిండని ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థినిలా ఉన్న తరణి పరీక్ష రాయడాన్ని మిగిలిన పిల్లలందరూ వింతగా చూశారు.

ఖమ్మంజిల్లా వైరా పట్టణంలో పరీక్షా కేంద్రంలో ప్రతిరోజూ ఆ చిన్నపిల్ల పరీక్ష రాయడాన్ని ఎంతో వింతగా చూసేవారు.

పరీక్షలు పూర్తయినప్పటి నుంచి ఫలితాలు ఎప్పుడు వస్తాయా అని తరణి ఎంతో ఆసక్తిగా ఎదురుచూసేది. ఆమె కన్నా తరణి తల్లిదండ్రులే ఎక్కువగా టెన్షన్ ఫీలయ్యారు.

రిజల్ట్స్ వస్తాయని రేడియోలో వింది.

ఆ విషయం రాత్రి 10 గంటలకు తెలిసింది.

ఇంటర్‌నెట్, ఇతర సదుపాయాలేవీ అందుబాటులో లేనందువల్ల ఆమె పేపరు కోసం ఎదురుచూసింది. రాత్రంతా ఆమెకు మగతగానే నిద్రపట్టింది.

ఉదయం పేపరులో తన నెంబరు చూసుకుని తరణి పొంగిపోయింది. ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలైంది.

* * *

పదవ తరగతి మార్కుల జాబితా చూసి ప్రేమ్‌చంద్ ఎంతో ఆనందించారు. కూతుర్ని తీసుకుని హైదరాబాద్ బయలు దేరాడు. ముఖ్యమంత్రి ఇంటర్వ్యూ సంపాదించి కలిశాడు.

కూతుర్ని పరిచయం చేసి పదవ తరగతిలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలైనట్లు మార్కుల జాబితాను చూపించాడు. చంద్రబాబునాయుడు మార్కులను చూసి తరణిని అభినందించాడు.

తర్వాత రైల్లో ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు "అమ్మా తరణీ! ముఖ్యమంత్రి వంటి ఉన్నతస్థాయి వ్యక్తులు నిన్ను ఆశీర్వదించారు. ఇంటర్మీడియెట్‌లో కూడా నువ్వు మంచి మార్కులతో పాసవ్వాలి... అందరి పేరునూ నిలబెట్టాలి..." అన్నాడు.

"అలాగే నాన్నా!" అంది.

ఆమె అన్న మాట ప్రకారం కృషి చేసింది.

ఇంటర్మీడియెట్ బైపిసి కోర్సులో చేరింది. అన్ని సబ్జెక్టులను కష్టపడి చదివింది. ఇతర పిల్లల కన్నా భిన్నంగా చదువును కొనసాగించింది.

2003 మార్చిలో పరీక్షలు జరిగాయి.

అందులో కూడా తరణి ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలైంది. ఆమె ఫలితాలు చూసి అందరూ ఆశ్చర్యపోయారు. వెయ్యి మార్కులకు 813 మార్కులను సంపాదించింది.

పదేళ్ల వయస్సులో ఇటువంటి అరుదైన రికార్డును సొంతం చేసుకోవడం ఎంతోమందిని ఆకర్షించింది. పత్రికలు తరణి ప్రతిభను మెచ్చుకుని రకరకాల కథనాలు ప్రచురించడంతో చాలామంది దృష్టిని తరణి ఆకర్షించింది.

* * *

విజయవాడ...

సమావేశ మందిరం ఆహూతులతో నిండిపోయింది.

నగర ప్రముఖులు పలువురు కార్యక్రమానికి హాజరయ్యారు. మైకులో సన్నని సంగీతం వినిపిస్తోంది.

శ్రీజ సంస్థ ప్రతి ఏడాది ప్రముఖులైన వ్యక్తులకు పురస్కారాలను ప్రదానం చేస్తుంది. ఒక్కొక్క రంగాన్ని ఎంచుకుని అందులో ప్రావీణ్యత సంపాదించినవారిని గుర్తిస్తారు.

ఆ ఏడాది పురస్కారానికి శ్రీజ నిర్వాహకులు తరణిని ఎంపిక చేశారు. సమాచారం ముందుగా పంపించడంతో కుటుంబ సభ్యులందరితో కలసి తరణి వచ్చింది.

సమావేశం ప్రారంభమైంది.

అప్పటి అసెంబ్లీ స్పీకర్ ప్రతిభా భారతి ముఖ్య అతిథిగా విచ్చేసి వేదికను అలంకరించారు. నిర్వాహకులు అవార్డుల పురస్కారాలు గూర్చి విపులంగా వివరించారు.

శ్రీజ అవార్డుకు ఎంపికైన తరణిని వేదిక పైకి ఆహ్వానించారు. పదేళ్ల వయస్సులో ఉన్న తరణి గబగబా వేదికపైకి వచ్చింది. పాఠశాలల్లో జరిగే ఆటల పోటీల్లో బహుమతులు ఇస్తున్నప్పుడు పిల్లల పేర్లు చదివితే వారు ఎంతో సరదా పడి పరుగు పరుగున ఎలా వస్తారో అలా వచ్చింది.

ఆమె హుషారుకు అందరూ చప్పట్లు కొట్టారు.

ప్రతిభా భారతి, తరణికి శ్రీజ పురస్కారాన్ని ప్రదానం చేసి అభినందనలతో ముంచెత్తారు. "తరణీ! నువ్వు చిన్నదానివి, అయినా పెద్ద చదువులు చదవాలి. నీ చదువు తెలివితేటలు సమాజానికి ఉపయోగపడాలి. కీపిట్ అప్!" అన్నారు.

తర్వాత కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు ముందుకు వచ్చి తాము ఉచిత విద్యను అందిస్తామని ప్రకటించాయి.

చివరలో తరణిని మాట్లాడమని కోరారు.

ఆ పాప ఏమి మాట్లాడుతుందోనని అందరూ ఎంతో ఆశక్తి ప్రదర్శించారు.

"నా చదువుకు నా ఉన్నతికి నా తల్లిదండ్రులే కారణం. పాఠ్యపుస్తకాల ద్వారా నాన్న తయారుచేసిన నోట్సు ఆధారంగా చదివాను... ఇందులో నా గొప్పతనం ఏమీలేదు. మానాన్న తాత వైద్యవృత్తిలో ఉన్నారు. నేనూ వైద్యురాలినై సమాజంలో నిరుపేదలకు సేవ చేస్తాను. జననీ జన్మభూమి నాకు ఇష్టమైనది. జన్మభూమిలోనే వైద్య వృత్తి చేస్తాను. నన్ను అందరూ పొగుడుతున్నారు. అభినందనలన్నీ నా తల్లిదండ్రులకే చెందాలి...!"అంటూ కింద కూర్చున్నవారిని తరణి చూపించింది.

వేదికపై ప్రముఖులు, ఆహూతులు అందరూ తరణి చూపించిన వైపే చూపులు సారించారు. ప్రేమ్‌చంద్‌కు, దీపికకు మనసు పులకరించిపోయింది.

అదుపులేని సుగర్ వ్యాధి - అనారోగ్యానికి పునాది



డా॥ ఎస్. శివరామకృష్ణయ్య,
శ్రీ రామినేని మధుమేహవ్యాధి చికిత్సా కేంద్రం, విజయవాడ.

14వ తేదీ ప్రపంచ మధుమేహ వ్యాధి దినోత్సవం

ఈ వ్యాధి పూర్వకాలం నుండి మధుమేహ వ్యాధి పేరుతో మన దేశంలో ఉంది. చరకుడు, శుశ్రుతుడు వంటి పూర్వపు వైద్యులు దీనికి చికిత్స చేశారు. ప్రస్తుతం అతివేగంగా పెరుగుతున్న మొదటి 10 దేశాలలో మన దేశం మొదటిస్థానంలో ఉంది. 1995 లెక్కల ప్రకారం 13.5 కోట్ల మంది ప్రపంచంలో ఉంటే 1.9 కోట్ల మంది మనదేశంలోనే ఉన్నారు. 2025 కల్లా మనదేశంలో ఈ సంఖ్య 5.7 కోట్లకు పెరుగుతుందని అంచనా. ఈ వ్యాధి ఉన్నా తెలియకుండా రెండు, మూడు రెట్ల ప్రజలు జీవితం గడుపుతున్నారు. ప్రస్తుతం మధుమేహ వ్యాధి వేగంగా పెరగటానికి కారణాలు అనేకం.

1. శారీరక శ్రమ తగ్గడం 2. బరువు పెరగటం, 3. మానసిక ఒత్తిడులు. తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన జన్యులోపానికి ఈ పై మూడు కారణాలు తోడై అగ్నికి ఆజ్యం పోసినట్లు రోజురోజుకు పెరుగుతూ చిన్న వయస్సులో కూడా బయటపడుతోంది.

సుగరు వ్యాధి అంటే :

రక్తంలో చక్కెర శాతం పెరిగి ఉండటాన్ని సుగరు వ్యాధి అంటాం.

ఈ క్రింది విధంగా సుగరు వ్యాధిని చెబుతాము

F.G.P.	2. H.P.G.
Normal	<100 mg /dl <140/dl
1.F.G.	100-125 / dl
1.G.T.	140-199 / dl
Dialutes-m-	> 126 / dl >_200 / dl

1F.G. Lowaired fastup glucose;
1GT - lompained glucose to urance
F.P.G. - Fastup plasma glucose;
P.G. - Past prandial glucose

వ్యాధి లక్షణాలు

అతి మూత్రం, అతి దాహం, అతి ఆకలి, బరువు తగ్గటం, గాయాలు మానకపోవటం, మర్మావయవాల వద్ద ఇన్‌ఫెక్షన్ మొదలగునవి.

ఈ వ్యాధి పరీక్షలు ఎవరు చేయించుకోవాలి?

తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు, దగ్గర బంధువులకు ఉన్నా, బరువు ఎక్కువగా ఉన్నా, రక్తపోటు, రక్తంలో క్రొవ్వులు ఎక్కువగా ఉన్నవారిలో, గుండెపోటు, పక్షవాతం వచ్చినవారిలో, ఎక్కువ బరువున్న పిల్లలకు జన్మనిచ్చిన తల్లులు, తరచుగా అబార్షన్ అవుతున్నవారు, మానని గాయం, పుండ్లతో ఉన్నవారు, 40 సంవత్సరాలు దాటినవారు, ఆపరేషన్ చేయించుకోబోయేవారు, గర్భిణీ స్త్రీలు మొదలగువారు.

ఈ వ్యాధిలో రకాలు

1. మొదటి రకం (ప్రథమ శ్రేణి చక్కెర వ్యాధి)
2. రెండవ రకం (ద్వితీయ శ్రేణి చక్కెర వ్యాధి)
3. గర్భిణీ సమయంలో సుగర్ వ్యాధి (G.D.M)
4. ఇతర రకాలు

కారణాలు ఏవైనా క్లోమ గ్రంథిలోని బీటా కణాలలో ఇన్సులిన్ అనే పదార్థం ఉత్పత్తి తగ్గటం మూలంగా కొంత ఇన్సులిన్ సరిగా పనిచేయకపోవటం (ద్వితీయ శ్రేణి చక్కెర వ్యాధి) లేక ఇన్సులిన్ పూర్తిగా ఆగిపోవటం మూలంగా (ప్రథమ శ్రేణి చక్కెర వ్యాధి) ఈ వ్యాధి బయట పడుతుంది.

ప్రథమ శ్రేణి చక్కెర వ్యాధి ముఖ్యముగా 16 సంవత్సరాల లోపు వారిలో వస్తుంది. మన దేశంలో ఇది తక్కువ. ద్వితీయ శ్రేణి చక్కెర వ్యాధి మన దేశంలో నూటికి 90% - 95% ఉంటుంది.

వ్యాధి నిర్ధారణ పరీక్ష - O.G.T.T.

సుగర్ వ్యాధి అదుపులో లేకపోతే ప్రమాదాలు :

1. కంటిలోని రెటీనా పొర దెబ్బతిని (D.Retino pathy) చూపుపోవడం, స్పర్శ తెలియకపోవటం
2. నరాలు శిథిలమై పాదాలు, కాళ్ళు, చేతుల మంటలు, పాదాల పుండు, కాళ్ళ వేళ్ళు తీసివేయటం, గుండె నొప్పులు తెలియకపోవటం, నపుంసకత్వం (D.Nenopathy)
3. మూత్ర పిండాలు దెబ్బతిని ప్రాణాపాయం కలుగుతుంది.
4. రక్తంలో కొవ్వు పెరిగి, రక్త నాళాలు సన్నబడి మూసుకుపోయి గుండె పోటు, పక్షవాతం, కాళ్ళ వేళ్ళు తీసివేయటం
5. నపుంసకత్వం,

LOSS OF VISION



NERVE DAMAGE



POOR CIRCULATION



HEART DISEASE



KIDNEY FAILURE



మధుమేహ వ్యాధి - ఆహార నియమాలు

సుగరు వ్యాధి ఉన్నవారు దిగులు చెందనవసరమే లేదు. క్రమశిక్షణతో, సంతోషంగా పూర్ణ జీవితాన్ని గడపవచ్చును.

- మనం తీసుకునే ఆహారంలోని పిండి పదార్థాలు జీర్ణమైన తరువాత సుగరు రూపంలో రక్తంలో కలసి రక్తంలోని సుగరు స్థాయిని పెంచుతాయి. అందువలన మధుమేహవ్యాధిని అదుపుచేయడంలో ప్రధానమైనది ఆహార క్రమశిక్షణ.
- మధుమేహ వ్యాధిని అదుపుచేయడానికి ఒక ప్రత్యేకమైన ఆహారమనేది లేదు. కొన్ని మార్పులతో ఎవరి అలవాట్లను బట్టి వారు ఆహారం తీసుకోవచ్చు.
- సుగరు వ్యాధి ఉన్నవారు వరి అన్నం తినకూడదు అనే అపోహ కొంతమందిలో ఉంది. అది సరైన అభిప్రాయం కాదు. వరి, గోధుమ, సజ్జలు, రాగులు లాంటి అన్ని ఆహార ధాన్యాలు దాదాపు 70 శాతం పిండి పదార్థాలు కలిగి ఉన్నాయి. కాబట్టి ఎంత తీసుకున్నామన్నది ప్రధానం కానీ వీటిలో ఏమి తీసుకున్నామన్నది అంత ప్రధానమైంది కాదు.
- సుగరు వ్యాధి ఉన్నవారు ముఖ్యంగా శాఖాహారులు పెసలు, మినుములు, అలసందలు, శనగలు, చిక్కుళ్లు, బఠానీలు మొదలగునవి వాడటం వలన వారికి కావలసిన మాంసకృత్తులు లభిస్తాయి. ఇవి మొలకెత్తినప్పుడు తీసుకోవడం వల్ల మరీ ఎక్కువగా పోషక పదార్థాలు మనకు లభించును.
- కాయగూరలు, ఆహార ధాన్యాలలో పీచు ఎక్కువగా ఉన్నందున అవి సుగరు వ్యాధిని అదుపు చేయడంలోనూ, రక్తంలో ఉన్న క్రొవ్వు పదార్థాలను తగ్గించటంలోనూ ఉపయోగపడతాయి. కావున ఇవి ఎక్కువగా తీసుకోవటం వల్ల సుగరు వ్యాధి అదుపుకు తోడ్పడతాయి. మునగ, బెండ, సొర, దొండ, వంగ, చిక్కుడు, టమాటో, ఆకు కూరలు, బూడిద గుమ్మడి, కాకరకాయ, కాలీఫ్లవర్, గుమ్మడి, క్యాబేజీ, బొప్పాయి, తెల్ల ముల్లంగి, బీర, ఉల్లి, పెద్దమిరపకాయ వంటి ఆకు, కూరగాయలలో పీచు తగినంత లభించును. శరీరం లావుగా ఉండి క్రొవ్వు ఎక్కువ ఉండి బరువు ఎక్కువ ఉన్నవారు కేలరీలు తగ్గించుకోవాలి.
- క్రొవ్వు పదార్థాలు - క్రొవ్వులు అధికంగా తీసుకోవడం వల్ల రక్తంలో కొలెస్ట్రాల్ అధికమై రక్తనాళాలు సన్నబడి, పూడిపోయి గుండెపోటు తదితర గుండె జబ్బులు వస్తాయి. కనుక వాటిని తగ్గించాలి. ముఖ్యంగా సుగరు వ్యాధి ఉన్నవారిలో గుండె జబ్బులు రావడం తరచుగా సంభవిస్తుంది. కనుక క్రొవ్వులను తగ్గించుకోవాలి. క్రొవ్వులలో ఉండే వివిధ క్రొవ్వు పదార్థాలను అవసరమైన పాళ్లలో తీసుకుంటే ఆరోగ్యం. వెన్న, కొబ్బరి, కొబ్బరినూనె, నెయ్యి, పామ్ ఆయిల్ వాడకం బాగా తగ్గించుకోవాలి.
- ఆకు కూరలు, కాయగూరలు అవసరానికి మించి తిన్నా సుగరు వ్యాధి ఉన్నవారికి మేలే. దుంపకూరలలో సుగరు ఎక్కువ ఉంటుంది కాబట్టి ఎక్కువ వాడరాదు.
- ఆహారం ఒకేసారి ఎక్కువ తినరాదు. దానినే రోజులో అయిదారు సార్లు తీసుకుంటే రక్తంలోని సుగర్ స్థాయిని కొంతవరకు అదుపులో ఉంచవచ్చు. పూర్తిగా భోజనం మానివేయడం, ఉపవాసాలు మంచివి కావు. రక్తంలోని చక్కెర స్థాయి క్రిందకు వెళితే ప్రమాదం. కావున అప్పుడప్పుడు నిమ్మరసం, టమాటో రసం, మజ్జిగ తీసుకోవటం మంచిది.

ఈ క్రింద చెప్పిన పదార్థాలను రక్తంలోని చక్కెర మామూలు స్థాయిలో ఉన్నా మానివేయడం మంచిది.

1 మామిడి పండ్లు, సపోటా, పనసపండ్లు, అరటిపండ్లు
2 తీయని పానీయాలు, బోర్నవీటా, బూస్ట్, హార్లిక్స్, ఆల్కహాల్ లేక కొబ్బరినీళ్లు, లేత కొబ్బరి కాయలు.
3 చక్కెర, గ్లూకోజ్, తేనె, స్వీట్లు, బెల్లం మొదలగునవి.
4 బాదం, పిస్తా, జీడిపప్పు.

రక్తంలో సుగర్ మామూలు స్థాయికి వచ్చిన తరువాత అవసరాన్ని బట్టి జామ, బొప్పాయి, ఆపిల్, బత్తాయి, ఉసిరిక, పుచ్చకాయ వంటి పండ్లను మితంగా తీసుకోవచ్చు.

క్రమశిక్షణ గల సైనికునివలె ఈ వ్యాధి ఉన్నవారు ఆహార నియమాలు పాటించినచో రక్తంలోని చక్కెర స్థాయిని అదుపులో ఉంచవచ్చును. ఈ వ్యాధి వల్ల కలిగే ఇతర శారీరక సమస్యలను నివారించవచ్చు. వాడే మందుల డోసులను తగ్గించుకోవచ్చు. శారీర భారాన్ని సమతుల్యం చేయవచ్చును. మధుమేహ వ్యాధిని అదుపులో ఉంచుకోవడానికి ఆహార క్రమశిక్షణ ఆవశ్యకం. మధుమేహ వ్యాధి అదుపు చేయగలిగిందే కాని నేటి శాస్త్ర పరిజ్ఞానం ప్రకారం పూర్తిగా లేకుండా చేయడం అసాధ్యం.

6. గర్భిణీ స్త్రీలకు, బిడ్డకు ప్రమాదాలు
7. ఇతర వ్యాధులు త్వరగా రావటం, త్వరగా క్షీణించి మరణాలు
8. జీర్ణాశయ పాక్షిక పక్షవాతం

వ్యాధి ఎలా అదుపు చేయాలి?

1. ఆహార - క్రమబద్ధీకరణ
2. వ్యాయామం
3. మానసిక ప్రశాంతత
4. సుగరు, ఎలర్జీ మందులు తీసుకోవడం
5. ఇన్సులిన్ తూ.చ. తప్పకుండా తీసుకోవడం
6. పొగ తాగడం మానివేయటం
7. ఆల్కహాల్ తాగడం మానివేయటం

తూ.చ. తప్పకుండా ఈ సూత్రాలను పాటిస్తే సుగరు వ్యాధిలేని వారి కంటే వీరి ఆరోగ్యమే మెరుగ్గా ఉంటుంది.

ఆహారం : సమతుల ఆహారం తీసుకోవడం, పచ్చికూరముక్కలు, మొలకెత్తిన రాగులు, శనగలు, అలసందలు తినటం మంచిది. ఆకుకూరలు, కాయకూరలు మంచిది. దుంపకూరలు తగ్గించాలి. చేప మంచిది. చర్మం తీసిన కోడి ముక్కలు తినవచ్చు. వేట, రొయ్య తగ్గించాలి. వేపుళ్లు మంచిది కాదు. పేరుకొనే నూనెలు తగ్గించాలి. సన్‌ఫ్లవర్ ఆయిల్, వేరుశనగ నూనె, తవుడు నూనె వాడవచ్చు. పామ్ ఆయిల్, డాల్డా, నెయ్యి, మీగడ, వెన్న, మాంసాహారపు కొవ్వు, కోడిగుడ్డులోని పచ్చసొన మంచివి కావు.

పంచదార, గ్లూకోజ్, తేనె, బెల్లం, కూల్‌డ్రింక్స్, స్వీట్లు, అరటిపండు, సపోటా, సీతాఫలం, మామిడిపండ్లు మానాలి. జామ, ఆపిల్, బత్తాయి, కమల, నారింజ, పుచ్చకాయ, నేరేడు పరిమితంగా తినవచ్చు.

రెండుమూడు గంటలకొకసారి ఒక గ్లాసు మంచినీరు త్రాగటం మంచిది.

వ్యాయామం : మనం తిన్న ఆహారంలోని సుగరు సక్రమంగా కణాలకు చేరి శక్తిగా మారాలంటే వ్యాయామం తప్పనిసరి. ఇన్సులిన్‌ను కణాలకు అందజేసే వ్యాయామం చేయాలి. రోజూ 45 నిముషాలు వ్యాయామం - డాక్టరు సలహా ప్రకారం చేయటం మంచిది.

మానసిక ప్రశాంతత : సుగరు వ్యాధి ఉన్నవారిలో మానసిక ఒత్తిడులు కూడా సుగరు స్థాయిని పెంచుతాయి. మనసును ప్రశాంతంగా ఉంచుకోవడం అవసరం.

వ్యాధికి మందులు : క్రమశిక్షణగా డాక్టరు రాసిన మందులను వాడుకోవాలి. సుగరును తగ్గించే మందులు, రక్తపోటు ఉంటే దానికి మందులు, సుగరు వ్యాధి వల్ల వేరే సమస్యలుంటే దానికి - అన్నింటికీ వాడుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారు.

ఇన్సులిన్ : ప్రథమ శ్రేణి సుగర్ వ్యాధి ఉన్నవారిలో ఇన్సులిన్ తప్పనిసరిగా వాడాలి. ద్వితీయ శ్రేణి చక్కెర వ్యాధి ఉన్నవారిలో బిళ్ళలకు తగ్గకపోతే ఇన్సులిన్ వాడతాము. ఆపరేషన్ సమయంలో టి.బి. లాంటి వ్యాధులున్నప్పుడు గాయాలు, పుండ్లు ఉన్నప్పుడు, గర్భిణీ స్త్రీలలో ఇన్సులిన్ వాడతాము. అవి తగ్గిన తరువాత బిళ్లలు వాడతాము. ప్రస్తుతమున్న సైన్స్ ప్రకారం సుగరు వ్యాధిని పూర్తిగా లేకుండా చేసే విధానం లేదు.

క్రమశిక్షణగా ఉంటే సుగరు పేషెంట్లు భయపడవలసిన పనిలేదు. క్రమశిక్షణ లేకుంటే సుగరు వ్యాధి సమస్యలోనికి జారిపోవలసి వస్తుంది.

క్రమశిక్షణే - సుగర్ వ్యాధికి రక్షణ

తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు....

వి. ఎ.సుహొమ్లీన్‌స్కీ ముప్పై అయిదు సంవత్సరాల సుదీర్ఘకాలం చిన్న పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడానికే తన జీవితాన్ని అంకితం చేశారు. విద్యాబోధనలో ఆయన చేసిన కృషికి సోవియట్ యూనియన్, దేశంలో వున్న అత్యున్నత గౌరవాలన్నింటితో అతడ్ని సత్కరించింది. పిల్లల పెంపకాన్ని, బోధనని ఒకే విద్యాక్రమంలో మిళితం చేయాలనే అభ్యుదయ బోధకుల కలను సుహొమ్లీన్‌స్కీ నిజం చేశారు. ప్రతి పిల్లవాడిలోనూ ప్రత్యేక వ్యక్తిని దర్శించడం అనేది ఆయన బోధనా పద్ధతిలోని ప్రత్యేకత. పిల్లల్ని పెంచి విద్యాబుద్ధులు నేర్పాలని ఆశించే ప్రతీవాళ్ళకు ఇది ఆదర్శంగా నిలవాలి.

పిల్లల్ని తెలివైనవాళ్ళు, మందకొడిగా వుండేవాళ్ళు అనే విభజన యేమీ చెయ్యకర్లేకుండానే మామూలుగా ఆరోగ్యంగా వుండే పిల్లవాడికెవడికైనాగానీ, ఈనాటి సెకండరీ విద్య బోధించవచ్చని సుహొమ్లీన్‌స్కీ సిద్ధాంతరీత్యా రుజువుచేశాడు. ఇది కొత్తగా కనిపెట్టిన సంగతి కాకపోవచ్చు. కాని ప్రభుత్వ బోధనా కార్యక్రమానికి అనుకూలంగా వుంటూ పిల్లవాడిని జ్ఞానమార్గంలో నడిపించేందుకు ఉపాధ్యాయునికి ఉపకరించే యుక్తివంతమైన పద్ధతిని ఆయన చూపించారు. పిల్లల్లో నేర్చుకోవాలనే కోరికను జాగృతం చెయ్యడం, స్వయం బోధనను, అభిరుచిని పెంపొందించడం, క్రమశిక్షణను పెంపొందించడం అనేవి సుహొమ్లీన్‌స్కీకి ప్రధానమైనవి. తన తోటి ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను సంప్రదిస్తూ, తన ఆలోచనలను గతకాలపు బోధకుల ఆలోచనలతోనూ, జానపద యుక్తితోనూ సరిచూసుకుంటూ, తన విద్యార్థులను అధ్యయనం చేశారు.

పిల్లలకు బోధించాలంటే మీరు వాళ్ళంటే ఇష్టపడాలి. అప్పుడు మాత్రమే పిల్లల్లో సంతోషాన్ని, స్నేహపూరిత భావాన్నీ, మానవత్వాన్నీ తీర్చిదిద్దగలం. ఉపాధ్యాయులు ప్రతి పిల్లవాడి హృదయాన్నీ అన్వేషించాలి. అప్పుడు మాత్రమే పిల్లలు తమ కుటుంబాలను, పాఠశాలను, పనిని, జ్ఞానాన్నీ, తమ మాతృదేశాన్ని ప్రేమించేటట్టు వాళ్ళకు నేర్పగలడు.

పిల్లవాడి హృదయాన్ని చూరగొనడమనే ఈ పద్ధతే సుహొమ్లీన్‌స్కీ విద్యా బోధనలో చేసిన కృషికి పునాది.

ఉపాధ్యాయుడికీ - విద్యార్థికీ ఉండే సంబంధం, మంచితనపు వాతావరణం ప్రసిద్ధ సోవియట్ బోధకుడు ఎ.ఎస్.మకరెంకో సృష్టించినవి. సుహొమ్లీన్‌స్కీ బోధనా వారసత్వం వీటిమీదే ఆధారపడింది. మకరెంకో పేరుమీద ప్రాచుర్యం పొందిన సమిష్టి బోధనా సిద్ధాంతాన్ని సుహొమ్లీన్‌స్కీ తన బోధనాత్మక ఆచరణ ద్వారా రుజువు చేశారు.

పిల్లలు బడి ప్రారంభించకముందే వాళ్ళని చుట్టివుండే ప్రకృతి, ఆట, అందం, సంగీతం, కల్పన, సృజనగల అద్భుత ప్రపంచాన్ని తరగతి గది లోపల మూసేసి వుంచకూడదనేది ముఖ్యం. పాఠశాల జీవితంలోని ప్రారంభమూ, సంవత్సరపు అధ్యయనాన్ని ఒకే రకమైన కార్యరంగంగా మార్చివెయ్యకూడదు. పిల్లవాడికి అంతకుముందున్న సంతోషాలే ఉపాధ్యాయుడు ధారాళంగా అందిస్తే పిల్లవాడు స్కూల్‌ను ప్రేమిస్తాడు. పిల్లలకు విసుగు పుట్టకుండా వుండటం కోసమని చెప్పి వాళ్ళ సంతోషానికి అనుగుణంగా చదువును తిప్పెయ్యడమూ, ఉద్దేశపూర్వకంగా చదువును తేలిక పరచడమూ ఉపాధ్యాయుడు చెయ్యకూడదు. కొంచెం కొంచెంగా పిల్లవాడ్ని అతి ముఖ్యమైన జీవితపార్శ్వానికి సిద్ధం చెయ్యాలి. మానసిక కృషి లేనిదే అసాధ్యమయ్యే గంభీరమైన పట్టుసడలని, ఓపికైన శ్రమకి సిద్ధం చెయ్యాలి.

తన జీవితపు ఆఖరి ఇరవై సంవత్సరాల్లోనూ సుహొమ్లీన్‌స్కీ తన పరిశీలనలనూ, ఆలోచనలనూ నోట్ చేసుకుంటూ ఉండేవాడు. ఆ నోట్స్ ఆధారంగా తయారైన గ్రంథాలలో ఇది ఒకటి. తన జీవితాన్ని పిల్లలకోసమే ధారపోశాడు కాబట్టి "పిల్లలకే నా హృదయం అంకితం" అనే పేరు ఈ పుస్తకానికి పెట్టారు. ఈ పుస్తకం ప్రాథమిక స్థాయిలో వుండే బోధనా కృషికి సంబంధించింది. ఇందులో బాలబాలికలు చుట్టూతా వున్న ప్రపంచాన్ని ఎలా గ్రహించాలి. అభ్యసించడానికి వాళ్ళకు ఎలా సహాయపడాలి, వాళ్ళ మేధోశ్రమని ఎలా సులభతరం చేయాలి. వాళ్ళ హృదయంలో ఉన్నత భావాలూ, అనుభూతులూ ఎలా జాగృతం చేసి పదిలం చెయ్యాలి, మానవ గౌరవభావన - మానవుల పట్ల విశ్వాసాన్ని ఎలా పాదుకొల్పాలి. సోవియట్ మాతృదేశానికి తన ప్రేమను ఎలా ఇవ్వాలి. గ్రహించగల శక్తి వున్న వివేకానికి, పసివాళ్ళ సున్నితహృదయానికి ఉన్నత కమ్యూనిస్టు ఆదర్శాలపట్ల తొలి భక్తి బీజాలను ఎలా సంతరింపచేయాలి అనే విషయాలను బోధనా క్రమంలో ఈ పుస్తకం తెలియజేస్తుంది. బోధకునిగా సుహొమ్లీన్‌స్కీ అనుభవాలు సోవియట్ యూనియన్‌లోనే కాకుండా ప్రపంచమంతటా ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ఆదర్శప్రాయంగా నిలవడంతోపాటు వారి కర్తవ్యాన్ని నిర్దేశిస్తాయి.

- కె.పి.అశోక్‌కుమార్

"పిల్లలకే నా హృదయం అంకితం"

ఆంగ్లం: వి.ఎ.సుహొమ్లీన్‌స్కీ;
తెలుగుసేత: ఆర్వియార్.
ముద్రణ మరియు ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్: హైదరాబాద్.
వెల:100. పేజీలు 278

స్వీకారం



అమృతం గమయ

దాశరథి రంగాచార్య రచనలు - 12

రచన : డాక్టర్ దాశరథి రంగాచార్య; వెల:రు.160/-; ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.



దళిత తాత్త్వికుడు

రచన : డాక్టర్ దార్ల వెంకటేశ్వరరావు; వెల : 10/-; ప్రతులకు : దార్ల మంజుశ్రీ, హెచ్.నెం.4-8-189, ఆలంపల్లి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లా; దార్ల రవికుమార్, తెలుగు పండిట్, చేవేరు అగ్రహారం, ఈస్ట్‌గోదావరి జిల్లా



వీక్షణం

(డా॥ చెలికాని రామారావు స్మారకోపన్యాసాల సంకలనం)
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; డా॥ సి.స్టాలిన్, కార్యదర్శి, డా॥ చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ, రామచంద్రాపురం



రాకెట్ల వీరన్న

మైసూరు పరిసర ప్రాంతాలూ ఆహ్లాదకరమైనవే!



మైసూరు ప్రాంతం కర్నాటక రాష్ట్రంగా ఏర్పడక ముందు శాతవాహనులు, చాళుక్యులు తదితర రాజుల పాలనలో ఉండేది. ఆయా రాజులకున్న సాహిత్య సాంస్కృతిక కళాభిరుచులమేరకు ఈ ప్రాంతవు కళాసంస్కృతులు విరాజిల్లాయి. యాదవ, హోయసాల రాజులు మరింత శోభాయమానమైన కట్టడాలను కట్టించారు. ఆనాటి నుంచీ ఇదొక మనోహరమైన పర్యాటక ప్రాంతంగా ఉండేది. విజయనగర సామ్రాజ్య పాలకులు, సుల్తానులు ఈ ప్రాంతానికి ఇప్పుడు మనం చూస్తున్న ఎన్నో అందాలను చేకూర్చిపెట్టారు. మైసూరు పట్టణంలోని అందాలే కాదు దాని చుట్టుపక్కల కూడా మనం తప్పక చూడాల్సిన ఎన్నో పర్యాటక ప్రాంతాలున్నాయి. అక్టోబరు నుంచి ఫిబ్రవరి నెలల్లోని సెలవు దినాలు, ఇక్కడి భౌగోళిక వాతావరణం ఎంతో చక్కగా కుదిరాయి. ఆ రోజులలో ఈ ప్రాంతాలు పర్యటించడానికి అనువైనవి.

శివసముద్రం :

మైసూరు నగరానికి 87 కిలోమీటర్ల దూరంలోను, సోమ్‌నాథ్ పూర్‌కు 27 కిలోమీటర్ల దూరంలోను శివసముద్రం ఉంటుంది. దీనిని ఐలాండ్ పట్టణమని కూడా పిలుస్తారు. అత్యద్భుతంగా, చూడచక్కగా రెండు జలపాతాలు ఇక్కడ ఉన్నాయి. 200 అడుగుల ఎత్తుపై నుండి దూకే "గగన చుక్కి", "భారాచుక్కి" అనే అద్భుతమైన జలపాతాలు ఇక్కడ కనువిందు చేస్తాయి. 1902లో మొట్టమొదటిసారి కర్నాటకలో ఇక్కడ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని స్థాపించారు. ఇక్కడ రంగనాథ, సోమేశ్వర, వీరభద్ర, మేరి అనే దేవాలయాలు ఉన్నాయి. మైసూరు నుంచి రెగ్యులర్‌గా బస్సులు ఇక్కడికి ఉన్నాయి.

సోమనాథ్‌పూర్ :

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన శిల్పాలయంగా సోమనాథ్‌పూర్ ఆలయాన్ని చెప్పవచ్చు. తూర్పు మైసూర్ నగరానికి 48 కిలోమీటర్ల దూరంలో ఇది ఉంటుంది. శ్రీరంగపట్నం నుంచి 24 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. రెండు చోట్ల నుంచి తరచుగా బస్సుల సౌకర్యాలున్నాయి. కావేరీనది ఎడమ భాగాన ఉన్న సోమనాథ్‌పూర్‌లో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన చెన్నకేశవ దేవాలయం ఉంది. క్రీ.శ.1260లో హోయసాలల నిర్మాణశైలిలో దీనిని నిర్మించారు. దీనితోపాటు ఇక్కడ వేణుగోపాలస్వామి దేవాలయం ఉంది. దీనిని హోయసాలరాజు ''నరసింహ'' క్రీ.శ.1269లో నిర్మించారు. ఈ దేవాలయ కుడ్యాలపై చెక్కిన శిల్పాలు భారతీయ శిల్పకళను, అప్పటి శిల్పుల ప్రతిభా పాటవాలను గుర్తు చేస్తాయి. వేలాది శిల్పాలు మనకు ఇక్కడ తారసపడతాయి. నక్షత్రాకారంలో ఉన్న ఈ దేవాలయాన్ని చూసి తీరాల్సిందే.

బండీపూర్ నేషనల్ పార్క్:

మైసూరుకు 80 కి.మీ.దూరంలో, మైసూర్-ఊటీ రోడ్డులో 'బండీపూర్ నేషనల్ పార్క్' ఉంది. ఇది చాలా పెద్ద జంతు సంరక్షణశాల. దాదాపు 874 చ.కి.మీ.ల విస్తీర్ణంలో ఈ పార్క్ ఉంది. ఇందులో 50 రకాల వృక్షజాతులు, 200 రకాల పుష్పజాతులు, 180 రకాల పక్షిజాతులు, ఏనుగులు, జింకలు, పులులు, ఎలుగుబంట్లు, నెమళ్ళు ఇంకా ఎన్నో రకాల జంతువు లున్నాయి. ఏనుగుపై ఎక్కి ఈ పార్క్ మొత్తం తిరిగే అవకాశం ఉంది.

ఇలా ఏనుగు అంబారీ కూడా ఎక్కి మైసూరులోని అందాల్ని చూడ్డం గుర్తుండిపోయే అనుభూతి. ✥

హెచ్.రమేష్‌బాబు

రఘుపతి వెంకయ్య అవార్డు విజేత

తెలుగు సినిమా చరిత్రలో స్వర్ణయుగం అనదగిన 1950-60 దశకాల్లో ఉత్తమాభిరుచి గల సినిమాలు తీసిన నిర్మాతల్లో వి.బి. రాజేంద్ర ప్రసాద్ ఒకరు. ఆయన నలభై ఏళ్ల సినీ సేవలకు గుర్తింపుగా ఇటీవలే నవంబర్ 10న ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన రఘుపతి వెంకయ్య అవార్డు ప్రకటించింది. 1980లో ప్రారంభమైన ఈ అవార్డును అందుకున్న 24వ ప్రముఖుడీయన.

వి.బి.రాజేంద్రప్రసాద్ ప్రారంభంలో రంగస్థల నటుడు. కాకినాడ పి. ఆర్. కాలేజీలో డిగ్రీ చదివే రోజుల్లోనే ఔత్సాహిక నటుడుగా పలు నాటకాల్లో వేషాలు వేశారు. ఒకసారి పంకజం అనే ఆడవేషం వేసి ఆంధ్రా యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ నుంచి ఉత్తమ నటుని అవార్డు అందుకున్నారు. ఈ ఉత్సాహంతోనే సినీ నటుడవ్వాలని 1958లో మద్రాసు చేరుకుని ముమ్మరంగా ప్రయత్నం చేశారు. కాని ఎవరూ ఆయనకు అవకాశం ఇవ్వలేదు. కొందరు మిత్రుల సలహాతో రాజేంద్ర ప్రసాద్ నిర్మాతగా మారి "జగపతి ఆర్ట్ పిక్చర్స్" సంస్థను ప్రారంభించారు.

జగపతి బ్యానర్‌పై రాజేంద్ర ప్రసాద్ తొలుత నిర్మించిన చిత్రం ''అన్నపూర్ణ''. వి.మధుసూదన రావు దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా జమున, జగ్గయ్య నాయికా నాయకులుగా 1960 జూన్ 3న విడుదలైంది. ఈ చిత్రం బాగా ఆడడంతో ఆయన "అ. ఆ" సెంట్‌మెంట్‌తో వరుసగా చిత్రాలు తీశారు. అక్కినేని నాగేశ్వరరావు, వి.మధుసూదనరావులతో టీంగా ఏర్పడి తీసిన చిత్రాలు అన్నీ విజయం సాధించాయి.

రెండవ చిత్రంగా తాను కలకత్తాలో చూసిన 'సాగరిక' చిత్రాన్ని ఆధారం చేసుకుని తెలుగులో ఆరాధన (1962)గా తీశారు. అక్కినేని, సావిత్రి హీరోహీరోయిన్‌లుగా నటించిన ఈ సినిమా విజయం సాధించింది. ఆ తరువాత ఆత్మబలం, అంతస్తులు, ఆస్తిపరులు, అదృష్టవంతులు, అక్కా చెల్లెళ్లు తీశారు. వరుసగా ఈ సినిమాలన్నీ ఆర్థికంగా విజయం సాధించడం రాజేంద్ర ప్రసాద్ ఉత్తమాభిరుచికి నిదర్శనం.

1971లో ఎప్పటిలా వి.మధుసూదనరావు దర్శకత్వంలో 'దసరాబుల్లోడు' చిత్రాన్ని ప్లాన్ చేశారు. కానీ ఆయన బిజీగా ఉండి ఈ సినిమాకు పని చేయలేకపోవడం, ఇంతలో అనుకున్న హీరోయిన్ వెనక్కి తగ్గడంతో సినిమా ఆగిపోయింది. కానీ అక్కినేని ప్రోత్సాహంతో హీరోయిన్‌గా వాణిశ్రీని తీసుకుని పదేళ్ళ పాటు నిర్మాతగా ఉన్న అనుభవంతో దర్శకత్వం వహించేందుకు నిర్ణయించుకున్నారు. "దసరా బుల్లోడు" విడుదలై విజయఢంకా మ్రోగించడంతో దర్శకుడిగా రాజేంద్ర ప్రసాద్ ఆ తరువాతి చిత్రాలకు కూడా పని చేశారు. 'దసరా బుల్లోడు' ఏడాది పాటు ఏకధాటిగా ప్రదర్శితం కావడం విశేషం. ఈ చిత్రంతోనే అక్కినేని పాటలకు స్టెప్పులు వేయడం ప్రారంభమైంది.

వాణిశ్రీ, అక్కినేనిలతో 1973లో 'బంగారు బాబు', మంజుల-అక్కినేనితో 'బంగారు బొమ్మలు' 'ముద్దుల కొడుకు' చిత్రాలు తీశారు. ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్.లు హీరోలుగా 'రామకృష్ణులు' తీశారాయన. కానీ ఈ సినిమా అంతగా హిట్ అవ్వలేదు.

వి.బి. రాజేంద్ర ప్రసాద్ తీసిన చాలా చిత్రాల్లో అక్కినేనియే హీరో. ఆయన మాటల్లోనే "నాగేశ్వరరావు గారు కేవలం నా చిత్రాల్లో హీరో మాత్రమే కాదు. మా సంస్థ మంచి, చెడులను గురించి సద్విమర్శ చేసే సన్నిహితులు కూడా". 'దసరా బుల్లోడు' ప్రాజెక్టు సమయంలో దర్శకుడు, హీరోయిన్ సెట్స్‌మీదికే రాకపోయే సరికి ఈ సినిమానే మానేద్దామనుకుంటున్న సమయంలో అక్కినేనిగారే ఈయన్ను డైరెక్ట్ చేయమన్నారు. అలాగైతే తానే సినిమాలో నటిస్తానని చెప్పడంతో వి.బి. దర్శకుడిగా మారారు. మిత్రుల కోసం ఆయన 'అందరూ దొంగలే' తీసి లాభాలను మిత్రులకే పంచారు. 1976లో తమ జగపతి సంస్థలోని ఉద్యోగుల సహాయార్థం శోభన్‌బాబు, మంజులతో 'పిచ్చి మారాజు' నిర్మించి దర్శకత్వం వహించారు. ఈ సినిమా లాభాలతో సిబ్బంది స్వంత ఇళ్లను నిర్మించుకున్నారు.

ఈ నేపథ్యంలో 'ఎస్. పి. భయంకర్', 'భార్యా భర్తల బంధం', 'కెప్టెన్ నాగార్జున' చిత్రాలను స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. తన కుమారుడు జగపతి బాబును హీరోగా పరిచయం చేస్తూ సింహస్వప్నం, 'కిల్లర్' (1992), 'భలేబుల్లోడు', 'పెళ్లి పీటలు' చిత్రాలను నిర్మించారాయన.

తెలుగుతో బాటు తమిళంలో శివాజీగణేషన్‌తో "పట్టా కత్తి భైరవన్' తీశారు. ఆ తరువాత ''ఎంగళ్‌తంగరాజ', 'ఉత్తమన్' వంటి మూడు సినిమాలు తీశారు. మరో వైపు హిందీలో 'బేకరార్', 'రిస్తే ప్యార్‌కే', 'కత్రోంకా కిలాడి' మూడు సినిమాలు తీశారు. ఇలా మొత్తం 40 ఏళ్ల సినీ దర్శక నిర్మాతగా ఆయన తీసిన చిత్రాల సంఖ్య 34 కాగా,

దెయ్యాలకు వైద్యం ప్రజలకు తెలుసు!

ఓటరు వస్తాదు వడ్డించిన
పిడిగుద్దుల దద్ధోజనం అరక్కపోతే
ఇలాంటి అజీర్తిరోగమే తగులుకుంటుంది
పదండి... మీ మూలాల్లోనూ ఇరుకు మస్తిష్కాల్లోనూ
శ్మశాన సేద్యపు కుతంత్ర వైద్యం కచ్చితంగా దొరుకుతుంది
అయోధ్యలోనూ, గుజరాత్‌లోనూ కావల్సినన్ని
కర, కపాల మూలికలు దొరుకుతాయి!
గర్భస్థ శిశువులంత తాజాతాజాగా
బెస్ట్ బేకరీ రోటీలంత గరంగరంగా లభ్యమవుతాయి!
పరాజయ గాయాల్ని అద్దాల్లోనూ, అబద్ధాల్లోనూ
అందంగా దాచేసుకొని
మూలాల్లోకి పలాయించండి...
పేరుకు మూలాలే కానీ, నిత్యం శిరోధార్యాలే కదా!
మౌఢ్యాన్ని, మూర్ఖత్వాన్ని ఒళ్లంతా పులుముకొని
సలుపుతీపులను చల్లార్చుకొండి
ఉన్మాదమంటలు రాజేసుకొని ఒంటికి కాపడాలు పెట్టుకొండి
కంకాళ నృత్యవిలాపాల మధ్య
మృత్యు సంగీతం వినిపించుకొండి!

మానవదెయ్యాల్లా వెనక్కువెనక్కు నడుచుకుంటూ
నాగరిక సమాజం నుంచి అనాగరిక అరణ్యంలోకి
లౌకిక జీవనం నుంచి మతోన్మాద వల్మీకంలోకి
వడివడిగా జారిపొండి...
సంకుచిత బొరియల్లోకి, చీకటి గుహల్లోకి
ముఖాలను దూర్చేసుకొండి...
తవ్వుకోండి....
తవ్వటం ఒక్కటే కదా మీకు తెలిసిన విద్య!
తవ్వుకుంటూ తడుముకుంటూ తలకెత్తుకుంటూ
ఆటవిక మూలాల్లోకి, అంధ విశ్వాసాల్లోకి చేరిపొండి

బిరడా బిగించి ఓటమి ఏడారుల్లోకి విసిరేసినా
పాపాల పంకిలంలోంచి పరిశుద్ధం కాకండి
గోతులు తవ్వే పాశవిక వ్యూహాన్నీ,
మంచిని, మనిషినీ భయపించే విద్రోహ రూపాన్నీ
విడిచి నిలబడకండి
అలా చేస్తే మనుషులైపోతారు
మీరు మనుషులైపోతే దెయ్యాలు ఒంటరివై పోతాయి!
యథాప్రకారమే కరాళఘంటికల కరసేవ కృత్యాలు కానివ్వండి...
దెయ్యాలకు దేహశుద్ధి చేసే ఓటింగు వైద్యం
ఈ దేశ ప్రజలకు ఎలాగూ తెలుసు!

-సత్యాజీ.

వీటిలో తెలుగులో 27, తమిళంలో 4, హిందీలో 3 చిత్రాలు. ఈ 34 సినిమాల్లో వి.బి. రాజేంద్రప్రసాద్ స్వయంగా దర్శకత్వం వహించినది 22.

రాజేంద్రప్రసాద్ నిర్మించిన చిత్రాల్లో ప్రధానంగా చెప్పుకోదగింది. సంగీతం, పాటలు. 'ఆత్మబలం'లోని ' చిటపట చినుకులు పడుతూ ఉంటే' పాట నేటికీ హిట్ సాంగే. దులపర బుల్లోడో దుమ్ము దులపర బుల్లోడ (అంతస్తులు), సోగ్గాడే చిన్ని నాయన ఒక్క పిట్టనైన కొట్టలేదు సోగ్గాడు(ఆస్తిపరులు), పాండవులు పాండవులు తుమ్మెదా (అక్కా చెల్లెలు), పచ్చగడ్డి కోసేటి పడుచుపిల్లో, చేతిలో చెయ్యేసిచెప్పు బావ (దసరాబుల్లోడు) వంటి పాటలు ఇప్పటికీ జనరంజకమైన గీతాలే. జగపతి సంస్థపై తాను తీసిన చిత్రాల్లోని పాటలతో 1980 దశకంలో 'చిటపట చినుకులు' అనే రెండు సినిమాలు విడుదల చేశారాయన. ఇలా పూర్తి పాటలతో ఒక సినిమాను విడుదల చేయడం ఇదే ప్రథమం.

అంతస్తులు సినిమా 1965లో ఉత్తమ చిత్రంగా రాష్ట్ర ప్రభుత్వం నంది అవార్డు, కేంద్ర ప్రభుత్వం ఉత్తమ ప్రాంతీయ చిత్రం అవార్డులను అందుకున్నది. ఫిలింనగర్ కో- ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షునిగా ఉన్న ఆయన చెన్నై తెలుగు అకాడమి పురస్కారం, యువ కళావాహిని వారి కె.వి. రెడ్డి అవార్డులతో సన్మానితులైనారు. మారిషస్ ప్రభుత్వం జగపతి వారోత్సవం పేర వీరి చిత్రోత్సవం నిర్వహించింది. ఉత్తమ దర్శక నిర్మాతగా వి.బి. ఈ వెంకయ్య అవార్డుకు ఎంతైనా అర్హులే. ✤

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

ఆస్థిలో మీ భాగం పొందవచ్చు

మా నాన్నకు ముగ్గురు అన్నదమ్ములు మా తాతగారికి ఇద్దరు భార్యలు. ఇందులో రెండవ భార్య కొడుకు మా నాన్న. ప్రస్తుతానికి అందరు వేరువేరుగా ఉన్నారు. మా తాత గారి ఆస్థి మా నాన్న పొందడానికి అర్హుడా? మేము అడిగినా మా అవ్వ పట్టించుకోవడం లేదు. ప్రస్తుతానికి మా నాన్న మరణించాడు. మేము 7గురు అన్నదమ్ములం. మా నాన్నగారి ఆస్థి రావాలంటే ఏం చేయాలో తగిన సలహా ఇవ్వండి.

- ఎస్.ఎమ్.భాష, ఎమ్మిగనూరు, కర్నూలు జిల్లా

మీ తాత గారు చనిపోయే నాటికి ఏమైనా వీలునామా లాంటిది రాశాడా? అలాంటిదేమీ లేకపోతే ఆ ఆస్తికి మీ నాన్నగారి వాటా తరఫున మీరు ఏడుగురు భాగస్తులవుతారు. మీ అవ్వగారిని ఒప్పించి తీసుకోగలిగితే మంచిది. లేదంటే కోర్టులో దావా వేసుకుని మీ భాగాన్ని మీరు పొందవచ్చు. మీ దగ్గరలోని న్యాయవాదిని సంప్రదించి దావా వేయండి. మీ భాగం మీరు పొందవచ్చు.

పెన్షన్ - తల్లిప్రేమ

మా నాన్నగారు రిటైరైన నెల రోజుల తరువాత చనిపోయారు. మా కుటుంబ బాధ్యతలు నేను తీసుకున్నాను. మా నాన్నగారి చేతుల మీద మా అక్కకి, చెల్లికి పెళ్ళిళ్ళు జరిగిపోయాయి. ప్రస్తుతం మా అమ్మని మా తమ్ముడు దగ్గర ఉంచుకొని వాడు వేరే ఊర్లో ఉంటున్నాడు. మా అమ్మకి వచ్చిన పెన్షన్ మొత్తం తనే తీసుకొంటున్నాడు. నేను మూడు సంవత్సరాల వరకు పెన్షన్ గురించి అడగలేదు. ఎందుకంటే వాడు అది జాగ్రత్త చేసి తరువాత లెక్కలు చెప్తాడనుకున్నాను. తీరా ఇప్పుడు అడిగితే అన్నీ అయిపోయాయి అన్నాడు. దేనికి అయ్యాయి అంటే వివరాలు చెప్పకుండా కోపం తెచ్చుకుంటున్నారు. ఎందుకిలే గొడవలని మా బంధువుల చేత అడిగిద్దామనుకుంటే వాడి ఆస్థి బలం చూసి మనకెందుకులే అని ఊరుకుంటున్నారు. మా అమ్మ ఎటూ చెప్పలేకపోతోంది. మా అమ్మని బాధపెట్టకుండా పాత లెక్కలతో సహా నేను పెన్షనల్‌లో వాటా పొందడం ఎలాగో సలహా ఇవ్వగలరు.

- కె.వి.ఉమ, విశాఖ

మీరు పెన్షన్ గురించి అడగాలనుకున్నప్పుడు మీ అమ్మగారిని మీ దగ్గర ఉంచుకోవాలనే ఆలోచన కూడా వచ్చి ఉంటే బాగుండేది. మీ అమ్మగారు లేక పెన్షన్ తనిష్టం వచ్చిన విధంగా వాడుకోవచ్చు. 'పెన్షన్' అనేది కొడుకులకు పంచే ఆస్థి కాదు. అది వారి సద్వినియోగం కోసమే. మీరు పాత లెక్కలుగాని, రాబోయే పెన్షన్‌ను గాని లీగల్‌గా ఏ విధంగాను పొందలేరు. ఆమెకు మీరు ప్రేమను పంచి తన పెద్దకొడుకు వద్దే ఉంటాను అనే పరిస్థితి తెచ్చి ఆమెను మెప్పించి తాను ఇస్తే తీసుకోవలసిన వారే.

రెండవ భార్యకు పెన్షన్

ఒక ముస్లిం పెన్షనరు భార్య చనిపోగా, తిరిగి వివాహం చేసుకున్నాను. సదరు పెన్షనర్ సర్వీసు పెన్షన్ పొందుచూ మరణించగా ఇప్పుడు ప్రభుత్వం నుండి రావలసిన ప్రయోజనాలు అతని వారసురాలిగా రెండవ భార్యకు వస్తాయా? దయచేసి వివరంగా తెలుపగలరు.

- షేక్‌పెద బడేమియా, పురుషోత్తమ పట్నం, చిలకలూరిపేట

మొదటి భార్య చనిపోతే రెండవ భార్యగా అతడి సర్వహక్కులు పొందగలుగుతారు. అతడి పెన్షన్ కూడా రెండవ భార్య పొందగలుగుతుంది.

మీరు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయవాదులు సలహాలు ఇస్తారు. ఈ సమస్యలతో సతమతమయ్యే పాఠకులు తమ ప్రశ్నలను ప్రజాశక్తికి పంపిస్తే వీలువెంబడి న్యాయవాదుల సమాధానాలు ప్రచురిస్తాము.

చిరునామా :

న్యాయసలహాలు
ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం. 1,
అశోక్‌నగర్, హైదరాబాద్ - 20



చేపల పులుసు

కావలసిన వస్తువులు:

చేపలు(బొచ్చెలు)	:	1 కేజీ
ధనియాలు	:	25 గ్రాములు
ఎండు కొబ్బరి	:	50 గ్రాములు
వెల్లుల్లి	:	25 గ్రాములు
లవంగాలు	:	5 గ్రాములు
దాల్చిన చెక్క	:	5 గ్రాములు
గసగసాలు	:	50 గ్రాములు
పసుపు	:	ఒక స్పూన్
ఉప్పు	:	తగినంత
కారం	:	తగినంత
ఉల్లిపాయలు	:	250 గ్రాములు
పచ్చి మిర్చి	:	5 కాయలు
కొత్తిమీర	:	ఒక కట్ట
నూనె	:	200 గ్రాములు

తయారుచేసే విధానం:

ముందుగా చింతపండును ఒక గిన్నెలో నానబెట్టాలి. గసగసాలను రుబ్బి ఒక గిన్నెలోకి తీసుకోవాలి. మసాలా దినుసులను మిక్సీ వేసి పొడిని ఒక గిన్నెలో పెట్టుకోవాలి. ఉల్లిపాయలను, మిర్చిని సన్నగా తరిగి వుంచుకోవాలి. ముక్కలుగా కోసిన చేపలలో ఉప్పు, మజ్జిగ, పసుపువేసి శుభ్రంగా కడగాలి. (అలా చేస్తే నీచు వాసన తగ్గుతుంది.) వెడల్పాటి పాత్రలో నూనె పోసి స్టౌపై పెట్టి నూనె మరిగిన తరువాత ఉల్లిపాయలను, మిర్చిని దానిలో వేసి దోరగా వేయించిన తరువాత చింతపండు పులుసు పోసి మరగనివ్వాలి. పులుసు గుత్తగా (దగ్గరకు) ఉడికిన తరువాత చేపల ముక్కలను దానిలో వేసి ఉడికించాలి. (ఇలా చేయటం వలన చేపముక్కలు చితకకుండా వుంటాయి.) అయిదు నిముషాలు అయిన తరువాత రుబ్బి వుంచుకున్న గసగసాలను వేసి ఉడకనీయాలి. ముక్కలు వుడికిన తరువాత దించేటప్పుడు మసాల దినుసులను వేసి అయిదు నిముషాల తరువాత దించి కొత్తిమీర దానిపై అలంకరించాలి.

పంపిన వారు:
పి. శాంతిలక్ష్మి,
హైదరాబాద్

కాకరకాయ వేపుడు

కావలసిన వస్తువులు

కాకరకాయలు (చిన్నవి)	:	అర కేజీ
ధనియాలు	:	15 గ్రాములు
ఎండు కొబ్బరి	:	50 గ్రాములు
ఎండు మిరపకాయలు	:	పది
జీలకర్ర	:	ఒక స్పూన్
మెంతులు (వేయించినవి)	:	ఒక స్పూన్
మిరియాలు	:	10 గింజలు
పెరుగు	:	ఒక కప్పు
పసుపు	:	ఒక స్పూన్
ఉప్పు	:	తగినంత
ఉల్లిపాయలు	:	250 గ్రాములు
కరివేపాకు	:	రెండు రెబ్బలు
నూనె	:	200 గ్రాములు

తయారుచేసే విధానం:

ముందుగా ధనియాలు, ఎండు కొబ్బరి, ఎండు మిరపకాయలు, జీలకర్ర, మెంతులు, మిరియాలను మిక్సీలో వేసి పొడరు చేసి ప్రక్కన పెట్టుకోవాలి. ఉల్లిపాయలను సన్నగా తరిగి వుంచుకోవాలి. తరువాత కాకరకాయలను శుభ్రంగా కడిగి దానిలో కొంత ఉప్పు, పసుపు, పెరుగు వేసి ఉడక పెట్టాలి. ఇలా చేయటం వలన కాకరకాయలోని చేదుపోతుంది. కాకరకాయలు ఉడికిన తరువాత స్పూన్‌తో కాయలకు గాట్లుపెట్టి దానిలో మీరు మిక్సీచేసిన దినుసుల పొడరును కూరాలి. ఆ తరువాత బాండీలో నూనె పోసి మరిగిన తరువాత ఉల్లిపాయ ముక్కలను, కరివేపాకునువేసి దోరగా వేగిన తరువాత కాకరకాయలను నూనెలోవేసి కాయలు విడిపోకుండా జాగ్రత్తగా వేయించాలి. కాకరకాయలలో కూరగా మిగిలిన పొడర్‌ను కాకరకాయలు వేగేటప్పుడు వాటిపై చల్లాలి.

కలం స్నేహం

పేరు : కె.అప్పలనాయుడు
వయసు : 8 సం॥
చదువు : 3వ తరగతి
హాబీలు: కార్టూన్ చిత్రాలు చూస్తాను, క్రికెట్ ఇష్టం
చిరునామా: కె.అప్పలనాయుడు,
సన్నాఫ్ కె.జగదీశ్వరరావు, గ్రౌండ్ ఫ్లోర్ నెం.5, నందిని అపార్ట్‌మెంట్, 4వ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, విశాఖపట్నం.

పేరు : వేగు శ్రీదేవి
వయసు : 13 సం॥
చదువు : 8వ తరగతి
హాబీలు: చదవటం, ఆడుకోవడం, మొక్కలు పెంచడం, బొమ్మలు వేయడం
చిరునామా: వేగు శ్రీదేవి,
డోర్ నెం.3-174, నేరేళమ్మ కాలనీ, ఇంద్రపాలెం, కాకినాడ, తూ.గో.జిల్లా

పేరు : బి.రజిత
వయసు : 12సం॥
చదువు : 4వ తరగతి
లక్ష్యం : డాక్టర్ కావటం
హాబీలు: పుస్తక పఠనం, ఆటలు ఆడుకోవడం
చిరునామా: బి.రజిత
శ్రీవివేకానంద విద్యావిహార్, ప్రైమరీ స్కూల్, కె.జి.రోడ్, పాములపాడు, కర్నూలు జిల్లా

పేరు : చామకూరి విష్ణుభరత్‌గౌడ్
వయసు : 6 సం॥
చదువు : 1వ తరగతి
హాబీలు: టీవీ చూడటం, వార్తాపత్రికలు చదవడం, ఆటలంటే ఇష్టం, క్యారమ్స్ ఆడటం, నాన్నతో సభలు-సమావేశాలకు వెళ్ళటం
చిరునామా: చామకూరి విష్ణుభరత్ గౌడ్, సన్నాఫ్ పుల్లయ్యగౌడ్, నేలకొండపల్లి, ఖమ్మం జిల్లా.

పేరు : ఎ.నదీమ్ బాషా
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు: బొమ్మలు గీయడం, క్రికెట్, చెస్ ఆడటం, నాణాలు, స్టాంపుల సేకరణ, చిన్నారిపేజీ చదవడం, పుస్తక పఠనం, పాటలు పాడటం
గమ్యం : రాష్ట్రపతి అవార్డు పొందడం
చిరునామా: ఎ.నదీమ్ బాషా,
ఎస్.పి.వి.బి.విద్యామందిర్, ఎన్.సి.పల్లె (రోడ్), ములకల చెరువు, తానిబళ్ళపల్లె, చిత్తూరు.

పేరు : కొమ్మినేని సోఫియా
వయసు : 10 సం॥
చదువు : 5వ తరగతి
హాబీలు: మ్యూజిక్ వినడం, ఆటలు ఆడటం, టీవీ చూడటం, జోక్స్ చదవడం
చిరునామా: కొమ్మినేని సోఫియా
డాటరాఫ్ ఆదినారాయణ, కలకొడిమ, తల్లాడ మండలం, ఖమ్మం జిల్లా

పేరు : జె.శ్రీకాంత్
వయసు : 11 సం॥
చదువు : 6వ తరగతి
హాబీలు: ప్రజాశక్తి పేపర్ చదవడం, క్రికెట్ ఆడటం, చూడటం, డ్రాయింగ్ వేయడం
లక్ష్యం : క్రికెటర్ కావడం
చిరునామా: జె.శ్రీకాంత్
సన్నాఫ్ జె.సి.లాల్, ఇ.నెం.21-34, మారుతీనగర్, అచ్చంపేట, మహబూబ్‌నగర్.

పేరు : వాస సాయి చరణ్
వయసు : 8 సం॥
చదువు : 3వ తరగతి
హాబీలు: చదువుకోవడం, ఆటలు ఆడటం, పాటలు పాడటం, క్రికెట్ ఆడటం
లక్ష్యం : డాక్టర్ కావటం
చిరునామా: వాస సాయి చరణ్
సన్నాఫ్ వాస హైమా వెంకట్, హెచ్.నెం.1-7-184, ఆర్.బి.నగర్, భువనగిరి, నల్గొండ.